


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 12-06-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 227 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కోవడానికి

# వైద్య విద్యార్థులు సిద్ధంగా ఉండాలి

-ప్రపంచ ఆరోగ్య సంస్థ(జెనీవా) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్

- అంతర్జాతీయ స్థాయిలో స్విమ్స్ అభివృద్ధి

- వైయస్సార్ ఆసరా పథకం ద్వారా వేలాది మంది రోగులకు నగదు రహిత వైద్య సేవలు

- టీటీడీ ఛైర్మన్, స్విమ్స్ ఛాన్సలర్ వైవి సుబ్బారెడ్డి - వేడుకగా స్విమ్స్ 11వ స్నాతకోత్సవం







తిరుమల/తిరుపతి(విజయభాను న్యూస్) : కోవిడ్ విసిరిన సవాళ్ళను ఎదుర్కోవడానికి వైద్య విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(జెనీవా) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ చెప్పారు. స్విమ్స్ 11వ స్నాతకోత్సవం శనివారం మహతి ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ, కోవిడ్-19 ఉధృతంగా ఉన్న సమయంలో బాధితులకు స్విమ్స్ అత్యుత్తమమైన వైద్య సేవలు అందించిందన్నారు. కోవిడ్ ప్రపంచానికి అనేక గుణపాఠాలు నేర్పించి పలు సవాళ్ళను విసిరిందని, భారతదేశం అతి త్వరగా వ్యాక్సిన్లు తయారు చేయించేందుకు అవకాశాలు కల్పించిందని తెలిపారు. వైద్య విద్యార్థులు కోవిడ్ నేర్పించిన గుణపాఠాలను పునశ్చరణ చేసుకుని భవిష్యత్తులో ఎదురయ్యే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, డిజిటల్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని పరిశోధనల వైపు దృష్టి సారించాలని కోరారు. ఉన్నత విద్యకు సంబంధించి 2015 వ సంవత్సరంలో మనం నిర్దేశించుకున్న సుస్థిర లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. రోగులు, వారి సహాయకుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, నిబద్ధతతో విధులు నిర్వహించి సమాజానికి ఉపయోగపడాలని కోరారు. స్విమ్స్ ఫ్యాకల్టీ వైద్యులు అంకితభావంతో విధులు నిర్వహించి ఎన్నో అవార్డులను

తరువాయి 2లో..

# ఏపీ వాసులకు చల్లని కబురు..



అమరావతి (విజయభాను న్యూస్) : నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా విస్తరిస్తున్నాయి. వచ్చే 48 గంటల్లో దక్షిణ ఆంధ్రప్రదేశ్ (రాయలసీమ)లోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రుతు పవనాలు ఏపీలోకి విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడినట్లు పేర్కొంది. అలాగే మధ్య అరేబియా సముద్రం, గోవాలోని మరికొన్ని ప్రాంతాలు, దక్షిణ మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులోని మరికొన్ని భాగాల్లోకి విస్తరిస్తాయని పేర్కొంది.

రుతు పవనాలు ఏపీకి దగ్గరగా రావడం వల్లే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గినట్లు వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రుతుపవనాలు కార్వార్, చిక్‌మంగళూర్, బెంగళూర్, పుదుచ్చేరి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు ఈశాన్య మధ్యప్రదేశ్ నుండి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు వ్యాపించి ఉన్న ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో వ్యాపించి ఉంది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో పలు చోట్ల తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

## అంతర్జాతీయ చదరంగ పోటీలో విశాఖ బాలుడి సంచలనం

# గ్రాండ్ మాస్టర్ పై గెలుపు



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ మరియు గీతం యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గీతం యూనివర్సిటీ 3వ వైజాగ్ గ్రాండ్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ -2022 లో శనివారం తేది.11.06.2022 న బి కేటగిరి పోటీలలో సంచలన విజయం నమోదు చేసింది. విశాఖకు చెందిన గంపా ఆదిత్య

తరువాయి 2లో..

# ఏపీలో టెట్ నోటిఫికేషన్ విడుదల

అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-ఆగస్టు 2022)ను ఆగస్టు 6 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఈమేరకు పాఠశాల విద్యా శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు ఈనెల 15 నుంచి జూలై 15వ తేదీ వరకు టెట్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఈనెల 16 నుంచి జులై 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. aptet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. అభ్యర్థులకు సహకరించేందుకు ఈనెల 13 నుంచి విద్యా శాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్కును ఏర్పాటు చేస్తున్నారు. జూలై 26వ తేదీ నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టులు




# క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ఎమ్. కృష్ణబాబు, ఐఏఎస్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, వైద్య ఆరోగ్య శాఖ






విశాఖపట్నం (విజయభాను న్యూస్) : క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎమ్. కృష్ణబాబు, ఐఏఎస్ , ప్రిన్సిపల్ సెక్రెటరీ, వైద్య ఆరోగ్య శాఖ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన ముఖ్య అతిథిగా గేట్ వే హోటల్, విశాఖపట్నం లో జరిగిన మొదటి హోమీ భాభా ఆసుపత్రి ,వైజాగ్ వార్షిక క్యాన్సర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుండి హెచ్‌బిసిహెచ్‌ఆర్‌సి తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. హెచ్‌బిసిహెచ్‌ఆర్‌సి విశాఖపట్నం వారి సేవలను అభినందించారు . ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరోగ్య మౌలిక సదుపాయాలు, సమగ్ర క్యాన్సర్ సంరక్షణ సేవలకు ఎంతో నిబద్ధతతో పనిచేస్తుందని తెలియజేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. క్యాన్సర్ సేవలను అప్‌గ్రేడ్ చేయడానికి ఏడు వైద్య కళాశాలలను గుర్తించామని తెలియజేశారు. విజయవాడ, తిరుపతి, వైజాగ్‌లలో మూడు ఎక్స్‌లెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.జాతీయ క్యాన్సర్ గ్రిడ్‌లో అన్ని ప్రభుత్వ క్యాన్సర్ సౌకర్యాలు మరియు ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ క్యాన్సర్ ఆసుపత్రులను చేర్చాలని కూడా ఆయన సూచించారు. అనంతరం ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాజన్ బద్వే మాట్లాడుతూ క్యాన్సర్ సంరక్షణ, సమస్య యొక్క

తరువాయి 2లో..

# గ్రూప్-1 అభ్యర్థులకు గుడ్ న్యూస్..

అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, ఇతర అభ్యర్థులకు మోడల్ ఇంటర్వ్యూల కోసం ఉచిత శిక్షణ, దిశానిర్దేశం చేయనున్నట్టు ఏపీ స్టడీ సర్కిల్ సంచాలకుడు కె.హర్షవర్ధన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపీపీఎస్‌సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులకు ఈ నెల 15 నుంచి మౌఖి క పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రకటించిందన్నారు.

ఈ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఏపీ స్టడీ సర్కిల్ ద్వారా ఆ అభ్యర్థులకు తగిన తర్ఫీదు ఇచ్చేందుకు మోడల్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఏడాదికి రూ.6 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఇతర అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోపు ఏపీటీడీసీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలని హర్షవర్ధన్ సూచించారు.

# రెండు నాల్కల ధోరణి చంద్రబాబు నైజం

- ర్యాబిస్ డాగ్స్ యజమాని చంద్రబాబు
- సింహంతో చర్చకు నక్కపిల్ల లోకేష్ కున్న అర్హతేంటి?
- 2 ఎకరాల నుంచి 5 లక్షల కోట్ల బాబు బాగోతం తెలిసిందే
- ఈ నెల 25న కడప జిల్లా చాపాడు లో మెగా జాబ్ మేళా

- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయిరెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోకి సీబీఐ రావొద్దంటూ ఆంక్షలు పెట్టి, ఇప్పుడు సీబీఐ లేకపోతే దేశాన్ని ఎవరు రక్షిస్తారని రెండు నాలుకల ధోరణి తో మాట్లాడుతున్న నాసిరకం రాజకీయ నాయకుడు (నారా) నాయుడు చంద్రబాబుది అందితే జుట్టు...అందకపోతే కాళ్లు పాలసీ అని ఇదే ఈ అవకాశవాది దినచర్యని

తరువాయి 2లో..

# నాడు - నేడుతో రోడ్లకు మహర్దశ

**- రూ. 164.08 లక్షల వ్యయంతో జిల్లాలోని రహదారులకు మరమ్మత్తులు**

**- ఆమదాలవలస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో శతశాతం మరామ్మతు పనులు**


**- రూ.56.18 లక్షల వ్యయంతో పూర్తయిన 400 మరామ్మతు పనులు**

**- పురోగతిలో మిగిలిన పనులు**

**- రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు -**



శ్రీకాకుళం : నేడు కార్యక్రమంతో రహదారులకు మహర్దశ వచ్చిందని, రూ. 164.08 లక్షల వ్యయంతో జిల్లాలోని రహదారులకు మరామ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటు న్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మరియు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పేర్కొన్నారు. ఈ మేరకు రెవిన్యూ శాఖ మంత్రి, కలెక్టర్ సంయుక్తంగా శనివారం పత్రికా ప్రకటన జారీచేసారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థతో పాటు ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల పరిధిలో 32 పనులకు గాను 1156 గుంతలకు మరామ్మతులు చేపట్టాల్సి ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అందులో రూ.56.18 లక్షల నిధులు వెచ్చించి 400 గుంతలకు పూర్తిస్థాయిలో మరామ్మతులు చేపట్టగా, నగరపాలక సంస్థ పరిధిలో 255, ఆమదాలవలసలో 96, పలాస-కాశీబుగ్గ లో 2, ఇచ్ఛాపురంలో 47 గుంతలకు పూర్తిస్థాయిలో మరామ్మతులు చేపట్టడం జరిగిందని వివరించారు. మిగిలిన 756 గుంతల మరామ్మతు పనులు వివిధ స్థాయిలో పురోగతిలో ఉన్నట్లు మంత్రి వివరించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో 17 పనులకు గాను 722 చోట్ల గుంతలకు మరామ్మతులు చేపట్టాల్సి ఉండగా, ఇందుకు రూ.112.11 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరుచేసినట్లు చెప్పారు. అందులో రూ. 48.31 లక్షల వ్యయంతో 255 మరామ్మతు పనులు పూర్తిస్థాయిలో చేయడం జరిగిందని తెలిపారు. ఆముదలవలస మున్సిపాలిటీలో 4 పనులకు గాను 96 గుంతలు ఉన్నట్లు అధికారులు గుర్తించగా, రూ.3.97 లక్షలు నిధులతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడం జరిగిందని మంత్రి స్పష్టం చేసారు. పలాస మున్సిపాలిటీ పరిధిలోని







9 పనులకు గాను 291 గుంతలకు మరామ్మతులు చేపట్టాలని అధికారులు గుర్తించగా, అందులో రూ. 0.90 లక్షల వ్యయంతో 2 పనులు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడం జరిగిందని, మిగిలిన 289 పనులు వివిధ స్థాయిలో పురోగతిలో ఉన్నాయని ఆయన వివరించారు. అదేవిధంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 2 పనులకు గాను 47 గుంతలకు మరామ్మతులు చేపట్టాలని అధికారులు గుర్తించారని, వాటికి రూ.3.00లక్షలు వెచ్చించి శతశాతం పనులు పూర్తిచేయడం జరిగిందని మంత్రి ఆ ప్రకటనలో వివరించారు. నాడు - నేడు కార్యక్రమం ద్వారా జిల్లాలో శతశాతం మరామ్మతులు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం, అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఆ ప్రకటనలో వివరించారు.

## భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కోవడానికి

# వైద్య విద్యార్థులు సిద్ధంగా ఉండాలి




సాధించాలని, ఇక్కడి వైద్య విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకుని స్విమ్స్ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలని కోరారు.

**అంతర్జాతీయ స్థాయిలో స్విమ్స్ అభివృద్ధి....**

టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు, స్విమ్స్ చాన్సలర్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షల మేరకు స్విమ్స్ అభివృద్ధి బాధ్యతను టిటిడి తీసుకుందని, అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్ఏబిహెచ్ గుర్తింపు కలిగిన ప్రభుత్వ రంగ సంస్థగా స్విమ్స్ నిలిచిందని, ఇక్కడ అతిపెద్ద హీమోడయాలసిస్ సెంటర్ ఉందని అన్నారు. స్టేట్ కోవిడ్ ఆసుపత్రిగా శ్రీ పద్మావతి మహిళా ఆసుపత్రి విశేషమైన సేవలందించిన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఇక్కడ సమర్థవంతంగా అమలు అవుతుందని, డాక్టర్ వైయస్సార్ ఆసరా పథకం కింద వేలాది మంది రోగులు నగదు రహిత వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. పదికి పైగా ఇన్సూరెన్స్ సంస్థలతో స్విమ్స్ ఒప్పందం కుదుర్చుకుందని, ఈ సంవత్సరం ప్రత్యేక గదులను ప్రారంభించారని తెలియజేశారు. స్విమ్స్ లో ఎంబిబిఎస్ పూర్తి చేసిన విద్యార్థులు దేశంలోని ప్రముఖ వైద్య విద్యా సంస్థల్లో పీజీ సీట్లు పొందుతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం స్విమ్స్ యూనివర్సిటీ నుండి బెస్ట్ అవుట్ గోయింగ్ మెడికల్ పీజీ విద్యార్థికి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందించేందుకు సొంత నిధుల నుండి 11 లక్షల రూపాయలు అందించనున్నట్లు ఈ సందర్భంగా చైర్మన్ ప్రకటించారు. వచ్చే సంవత్సరం నుంచి ఈ గోల్డ్ మెడల్ ని విద్యార్థులకు అందజేస్తామన్నారు. టిటిడి ఆస్పత్రులను స్విమ్స్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చి ఎస్వి హెల్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. డి ఆర్ డి ఓ సంస్థతో ఒప్పందం చేసుకుని మన దేశానికి చెందిన రోగులకు అవయవ మార్పిడి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. వైద్యులతో పాటు పారామెడికల్ సిబ్బంది, పరిపాలన విభాగం సిబ్బంది రోగులకు విశేషమైన సేవలు అందిస్తున్నారని, వీరికి పేస్కేల్స్, ఇన్సెంటివ్ ఇతర ఆర్థిక ప్రయోజనాలతో ఉద్యోగ భద్రత కల్పిస్తామని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా స్విమ్స్ కు అనుబంధంగా శ్రీ బాలాజీ అంకాలజీ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రేణిగుంట వద్ద ప్రపంచ స్థాయి క్యాన్సర్ పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమం లో స్విమ్స్ డాక్టర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

### అంతర్జాతీయ చదరంగ పోటీలో విశాఖ బాలుడి సంచలనం

# గ్రాండ్ మాస్టర్ పై గెలుపు

వరుణ్ (1836 రేటింగ్ క్రీడాకారుడు) వియత్నాం దేశానికి చెందిన గ్రాండ్ మాస్టర్ నగూన్ డక్ హువా (2398 రేటింగ్ క్రీడాకారుడు) పై విజయం సాధించాడు. అలాగే భారత క్రీడాకారుడు పవన్ హర్షత్ (1873 రేటింగ్ క్రీడాకారుడు) అజర్బైజాన్ కు చెందిన గ్రాండ్ మాస్టర్ మిరిజోవ్ అజర్ తో తలపడి పోటీని డ్రాగా ముగించాడు. భారత్ కే చెందిన మాస్టర్ మయాంక్ చక్రవర్తి (1978 రేటింగ్ క్రీడాకారుడు) మరో భారత గ్రాండ్ మాస్టర్ మిత్రబ గుహ పై (2499 రేటింగ్ క్రీడాకారుడు) విజయాన్ని నమ్మెదు చేశాడు. పోటీలలో రెండవ రోజైన శనివారం నాడు కేటగిరి -బి లో పాల్గొన్న క్రీడాకారులలో 169 మంది మ్నెదటి రౌండు పూర్తి అయ్యే సరికి 1/1 ఆధిక్యంతో కొనసాగుతున్నారని పోటీల నిర్వాహక సంఘం డైరక్టర్ , ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవివిశర్మ తెలిపారు.

# క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




భారం మరియు మన దేశంలో వివిధ క్యాన్సర్ల యొక్క మారుతున్న ఎపిడెమియోలాజికల్ ట్రెండ్‌లను తెలియజేస్తూ కీలకోపన్యాసం చేశారు. ఈక్విటబుల్ క్యాన్సర్ కేర్ యాక్సెస్‌పై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దేశవ్యాప్తంగా సమగ్ర కేన్సర్ సంరక్షణను అందించడంలో క్యాన్సర్ కేర్ యొక్క "హబ్ మరియు స్పోక్ మోడల్" పాత్రను ఆయన వివరించారు. దేశంలో అత్యధిక శాతం కేసులు పొగాకు వాడకం, ఊబకాయం, సంక్రమణ వ్యాధుల వలన కలుగుతున్నాయని తెలియజేశారు. ముందస్తుగా తెలుసుకోవడం ద్వారా క్యాన్సర్ ను అరికట్టవచ్చని వివరించారు. జీవనశైలి విధానం ఆరోగ్యకరంగా మార్చుకోవాలని తెలియజేశారు. ప్రతిరోజు నడక, వ్యాయామం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు పలు రకాల క్యాన్సర్లకు గల కారణాలు వివరించారు. అనంతరం సాంకేతిక సహాయం, మౌలిక సదుపాయాలు మరియు మానవ వనరుల శిక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరియు HBCHRC మధ్య ఒక అవగాహన ఒప్పంద కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉమేష్ మహన్ శెట్టి, డైరెక్టర్ హెూమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి విశాఖపట్నం, పలువురు హెూమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు, జిల్లా వైద్యాధికారిణి డా. విజయలక్ష్మి, శిక్షణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు నాల్కల ధోరణి చంద్రబాబు నైజం

రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.. ఈ మేరకు శనివారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. ర్యాబిస్ ముదిరిపోయిన పిచ్చి కుక్కలా మొరుగుతున్న గంజాయి (అయ్యన్న) పాత్రుడుని కాస్త అదుపులో పెట్టుకో చంద్రబాబూ, నువ్వు ఉస్కో అనగానే ఎవరిని పడితే వారిని కరవడానికి ఉరుకుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాబిస్ డాగ్స్ తమ యజమానికి గుర్తుపట్టలేవని గట్టిగా తరిమితే చివరకు నీ పిక్క కూడా పీకుతాడని, ముందు జాగ్రత్తగా గొలుసుతో కట్టేసి మీదకు రాకుండా చూసుకోవాలని సలహా ఇచ్చారు. సింహం లాంటి జగన్ నక్కపిల్ల లాంటి లోకేశ్ తో దమ్ముంటే చర్చకు రావాలని 'బురద పంది లాంటి గంజాయి (అయ్యన్న) పాత్రుడు సవాలు విసరడం హాస్యాస్పదమని, ఇంతకంటే విచిత్రమేముంటుందని ప్రశ్నించారు. మంగళగిరిలో ఏం ఖర్మ, నీవు దోచుకున్న లక్షల కోట్ల సొమ్ముతో 100 ఏళ్లపాటు తెలుగు రాష్ట్రాల్లో లక్ష క్యాంటీన్లు నడపొచ్చు దొంగ (చంద్ర) బాబూ. పదేళ్లపాటు ఫ్రీగా భోజనాలు పెట్టినా నీ సంపద ఉల్లి పొట్టంత కూడా తరగదని. 2 ఎకరాల నుంచి 5 లక్షల కోట్లు ఎలా సంపాదించావో జాతీయ మీడియా ఎప్పుడో ఆధారాలతో సహా బయటపెట్టిన విషయం గుర్తు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ఎల్లో మీడియా అబద్ధాలు వండి వారుస్తోందని. పెడన మండలం బల్లిపర్రులో 'జగనన్న కాలనీ మాకొద్దు' అని లబ్దిదారులు అన్నట్టుగా ప్రముఖ ఎల్లో పత్రిక ఈనాడు లీడ్ లో వ్రాసిందని, తీరా వార్తలో మాత్రం ఊరికి దూరంగా ఉండటం వల్ల ఇళ్ల నిర్మాణానికి అక్కడి లబ్దిదారులు ఆసక్తి చూపడం లేదని ఈ కుల పత్రిక పేర్కొందని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా చాపాడు మండలంలోని సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 25న వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళ నిర్వహించడం జరుగుతోందని, ఈ మేరకు జాబ్ మేళా పోస్టర్, వెబ్ సైట్ లను డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, ఎంపీ అవినాష్ రెడ్డి తదితరులతో కలిసి శనివారం ప్రారంభించడం జరిగిందిని అన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగార్థులు పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఏపీలో టెట్ నోటిఫికేషన్ విడుదల

నిర్వహిస్తారు. జూలై 25 నుంచి హాల్‌టిక్కెట్లు జారీ చేస్తారు. ఒకసారి దరఖాస్తు సమర్పించాక సవరణలకు అవకాశం ఉండదు. అందువల్ల అభ్యర్థులు దరఖాస్తును నింపిన తర్వాత అన్ని వివరాలు జాగ్రత్తగా సరిచూసుకొని సబ్మిట్ చేయాలి. టెట్ సిలబస్‌ను కూడా పాఠశాల విద్యా శాఖ ఇన్ఫర్మేషన్ బులెటిన్లో పొందుపరిచింది. పరీక్షలు పేపర్ 1ఏ, పేపర్ 1 బీ, పేపర్ 2 ఏ, పేపర్2 బీలుగా జరుగుతాయి. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరుగుతాయి. ప్రాథమిక కీని ఆగస్టు 31న విడుదల చేస్తారు. దానిపై సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది కీని సెప్టెంబర్ 12న విడుదల చేస్తారు. సెప్టెంబర్ 14న ఫలితాలు ప్రకటిస్తారు. డీఎస్సీలో వెయిటేజి టెట్‌లో అర్హతకు నిర్ణీత మార్కులను పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. ఆ మార్కులు సాధిస్తేనే టెట్‌లో క్వాలిఫై అయినట్లుగా పరిగణిస్తారు. అర్హత మార్కులు జనరల్ అభ్యర్థులకు 60 శాతం రావాలి. బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 శాతం మార్కులు రావాలి. టెట్ ధ్రువపత్రాల చెల్లుబాటు గతంలో ఏడేళ్లు మాత్రమే ఉండేది. తాజా నిబంధనల ప్రకారం జీవితకాలం చెల్లుబాటు అవుతుంది. టెట్‌లో అభ్యర్థులు సాధించిన మార్కుల స్కోరుకు ఉపాధ్యాయ నియామకాల్లో (డీఎస్సీలో) 20 శాతం మేర వెయిటేజీ కల్పిస్తారు.

వీరు అర్హులు డీఎల్‌ఈడీ, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు, 2020-22 బ్యాచ్‌లోని అభ్యర్థులు ఈ టెట్‌కు అర్హులు. గతంలో ఏపీ టెట్‌లో ఉత్తీర్ణులైన వారిలో మార్కుల స్కోరును పెంచుకోవాలనుకొనే వారు కూడా ఈ టెట్‌కు హాజరుకావచ్చు. 1 నుంచి 5 తరగతుల బోధనకు సంబంధించిన టీచర్లు పేపర్ 1-ఏకు హాజరుకావాలి. 6 నుంచి 8వ తరగతుల బోధనకు పేపం-2ఏ రాయాలి. 1 నుంచి 5 తరగతులలోని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ అభ్యర్థులు పేపర్-1బీ రాయాలి. 6 నుంచి 8వ తరగతుల స్పెషల్ ఎడ్యుకేషన్ బోధనకు పేపర్-2బీకి హాజరుకావాలి. 1 నుంచి 8 తరగతుల బోధన అభ్యర్థులు పేపర్-1ఏ, పేపర్-1బీ, పేపర్-2ఏ, పేపర్-2బీలను రాయాలి. అభ్యర్థులు వారు హాజరుకాబోయే పేపర్లకు వేర్వేరుగా రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. పరీక్షలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని నగరాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఒడిసాలలో నిర్వహిస్తారు.

# వంగలిలో ఇంటింటికి సీపీఎం ప్రచారం



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండలంలోని వంగలి గ్రామంలో ఇంటింటికి సిపిఎం ప్రచారం కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి. ప్రభావతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని రోడ్లు, వీధి కాలువలు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని యర్రోడు చెరువు లో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ పరదేశమ్మ గ్రూపు ఉపాధి కూలీలతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఉపాధి కూలీలకు సమ్మర్ అలెవెన్సు కింద మజ్జిగ,మెడికల్ కిట్, గునపం, పార, లీడ్, లిఫ్ట్ లను కూలీలకు పంపిణి చేసేవారని, నేడు సమ్మర్ అలెవెన్సు ను ఈ ప్రభుత్వం నిలిపివేయడం తగదన్నారు.గతంలో కూలీలకు వంద రోజులు పని కల్పిస్తుండేవారని, నేడు మధ్యలో పని మానేస్తే పనిరోజులు కుదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.ఉపాధి కూలీలకు అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పాడ సత్యవతి, సిపిఎం నేతలు యర్రా సొంబాబు, గవర సోము నాయుడు, ఊడి రాము నాయుడు,యర్రా సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15న చోడవరం లో జరగబోయే మినీ మహానాడు చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

## - మాజీ జెడ్పీటీసీ సభ్యులు కనిశెట్టి మత్స్యరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ సభ్యులు మత్స్య రాజు

చోడవరం(విజయభాను న్యూస్) : ఈనెల 15వ తేదీ బుధ వారం నాడు చోడవరం పట్టణంలో జరగబోయే మినీ మహా నాడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయాలని టిడిపి సీని యర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు కనిశెట్టి మత్స్యరాజు పిలుపు నిచ్చారు. మండలం లోని గజపతినగరం గ్రామంలో తన స్వగృహంలో స్థానిక టిడిపి నాయకులు, పార్టీ కార్యకర్త లతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా మత్స్య రాజు మాట్లాడుతూ...

చోడ వరంలో మినీ మహానాడు విజయవంతం చేయవలసిన బాధ్యత ప్రతి కార్యకర్త నాయకుల పైన ఉందన్నారు. మినీ మహానాడు విజయవంతం చేసి నియోజక వర్గంలో పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకువద్దామని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కని శెట్టి రాము నాయుడు, సిలపర శెట్టి నాయుడు, తాత అప్పారావు, ఆళ్ల రామకృష్ణ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన సచివాలయ పోలీసు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన అల్లూరి జిల్లా పోలీసు అధికారులు





అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలం ఎగువశోభ గ్రామ సచివాలయంలో పనిచేయుచూ తేది 27-04-2022 దిన రోడ్డు (ఏక్సిడెంట్.) ప్రమాధం లో చనిపోయిన కొర్రా జయ, భర్త పేరు సురేష్ కుమార్, వారి ఇద్దరు పిల్లలకు ఆర్థిక సహాయంగా అనంతగిరి, యస్ ఐ,కె,రాము, ,అనంతగిరి పోలీస్ సిబ్బంది, మరియు ఏపియస్పి సిబ్బంది, డుంబ్రిగుడ పోలీస్ సిబ్బంది, మరియు (ఏపిఎస్పి) ఏపియస్ పి సిబ్బంది, మరియు అనంత గిరి తోటి మహిళాపోలీసులు, అనంతగిరి మండల సచివాలయం సిబ్బంది యొక్క ఆర్థిక సహాయంతో మొత్తం 1,60,000/- లు .డబ్బును, శ్రీ అల్లూరి సీతారామరాజు జిల్లా యస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్,, ద్వారా జిఎంఎస్కె జయ వారి ఇద్దరు ఆడ పిల్లలు యోగిత శ్రీ, రక్షిత ల పేర్ల మీద అనంతగిరి యూనియన్ బ్యాంక్ లో పిక్సెడ్ డిపాజిట్ చేసి, బాండ్ లను అందజేయడమైనది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు శ్రీ తుహిన్ సీన్హా, (అడ్మిన్) అరకు సిఐ జిడి.బాబు, అనంతగిరి ఎస్ఐ.రాము డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది మరియు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# ఆరిలోవ అటవీ ప్రాంతంలో గోతులు పూడ్చిన వైసీపీ నాయకులు

## మండల యూత్ అధ్యక్షులు రామకృష్ణ నాయుడు, రైతు అధ్యక్షులు పోలిరెడ్డి రాజబాబు



నర్సీపట్నం (విజయభాను న్యూస్) : నర్సీ పట్నం నుండి గొలుగొండ మండలం దారిలో ఉన్న ఆరి లోవ అటవీప్రాంతం గోతులు పూడ్చే ఈ కార్య క్రమానికి మండలం వైఎస్ ఆర్సిపి యూత్ ప్రెసిడెంట్ రామ కృష్ణ నాయుడు మండల రైతు విభాగం అధ్యక్షులు పోలిరెడ్డి రాజబాబు తమ సొంత నిధులు వెచ్చించి మట్టితో గోతులు పూడ్చారు. దీంతో మండల ప్రజలు నాయకులు ప్రత్యేకంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. నర్సీ పట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ట్రాక్టరు, జెసిబి, బ్లేడ్ ట్రాక్టర్ ఉపయోగించి మట్టిని తోలుకుని వచ్చి, గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టినందుకు...

చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వారికి ఫోన్ చేసి అభినందనలు తెలియజేస్తున్నారు.

# అర్హులైన వారందరికీ పోడు పట్టాలు మంజూరు చేయాలి

## స్పందన కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ కు వినతిపత్రం





అల్లూరిసీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) : నియోజకవర్గం లోని డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీ సర్పంచ్ మరియు సిపిఐయం మండల నాయకులు పాంగి. సురేష్ కుమార్, అలాగే సీపీఎం మండల కార్యదర్శి ఎస్బీ. పోతురాజు. డుంబ్రిగుడ మండలం, గసభ పంచాయతీ పరిధిలోని మొర్రిగుడ, చిమిలిగుడ, ,జోడిగుడ, కంగారు, అడ్రగూడ గ్రామాల్లో పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న గిరిజన రైతులకు పోడు పట్టాలు మంజూరు చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ కు శనివారం వినతి పత్రం అందించారు ఈగ్రామంలో గల ప్రజలకు . వారందరికీ భూమి మీద హక్కు కల్పించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. తరతరాలుగా సాగు చేస్తున్న కూడా హక్కు పత్రాలు లేకపోవడంతోరైతు బరోసా వంటి పథకాలు అందుకో లేకపోయారనీ వినతి పత్రం ఇచ్చారు ఈ విషయం పై స్పందించిన సబ్ కలెక్టర్ అర్హులైన ప్రతి ఒక్కరికీ హక్కు పత్రాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు వంతాల. ఆనందరావు, పాంగి. దర్మరావు, వంతాల. బొంజుబాబు, వంతాల. సింహాద్రి పాల్గొన్నారు.

# లబ్ధిదారులు అందరికీ ఎరువులు, విత్తనాలు అందజేయండి

## పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్



పరవాడ (విజయభాను న్యూస్): పరవాడ మండల ప్రజా పరిషత్ సమావేశ మంది రంలో మండల వ్యవసాయ సలహామండల సమావేశం మండల చైర్మన్ కోన రామా రావు అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా పరవాడ మండల ప్రజా పరిషత్ అధ్య క్షులు పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ ఖరీఫ్ కి సంబంధించి ఎరువులు విత్తనాలు రైతులు కి ఇబ్బంది లేకుండా ఇవ్వవలసిందిగా తెలియజేసారు. మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ప్రతీ రైతు రైతు భరోసా కేంద్రం లో ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.రైతు భరోసా లో గ్రామస్థాయి వ్యవసాయ సలహామండల సూచన మేరకు విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు పూర్తి స్థాయిలో రైతు భరోసా కేంద్రం లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. .మండల వ్యవసాయ అధికారి చంద్రావతి మాట్లాడతూ ఈ ఖరీఫ్ కి వరి విత్తనాలు అర్ జిఎల్ 2537 రకం 32 క్వింటాళ్ళుమరియు బిపిటి5204 39 క్వింటాళ్ళు విత్తనాలకి ప్రణాళిక సిద్ధం చేయటం జరిగింది.

పశు వైద్యాదికారిణి అశ్విని మాట్లాడుతూ పసువుల టీకాలు మరియు పాలవెల్లువ గురించి వివరించారు.ఈ యొక్క కార్యక్రమంలో కమిటీ సభ్యులు బండారు రాజశేఖర్, పోలి రెడ్డి అప్పారావు ,పల్లా గోవింద, ఎఇఒ సంజీవరావు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

## చెత్తను సంపద కేంద్రాలకు తరిలించండి





పరవాడ (విజయభాను న్యూస్): చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలును మెరుగుపరచాలానీ పరవాడ ఇఒఅర్ డి పద్మజ అన్నారు. జిల్లా కలెక్టర్ అదేశాలు మేరకు పరవాడ ఎంపిడిఒ హేమసుందర్ రావు నేత్రత్వంలో వారం రోజులు పాటు ప్రతి పంచాయితీలో జరిగే పారిశుద్యన్ని శుభ్ర పరిచి చెత్తను సేకరించి సంపదతయారు చేసే కేంద్రాలుకు తరీలించే కార్యక్రమాన్ని శుక్రవారం నుండి ప్రారంభించారు. శు క్రవారం నుండి వారం రోజులు పాటు ప్రతిరోజు ఈ కార్య క్రమాన్ని తప్పనిసరిగా ప్రతి పంచాయితీలో నిర్వహించాలానీ అన్నారు.

ఈ కార్యక్రమంలో మండలములో గల పంచాయితీ కార్యదర్శిలు తథితర్లు పాల్గోన్నారు.

# జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

## రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గ ఇంఛార్జి తమ్మిరెడ్డి శివశంకర్



సబ్బవరం (విజయభాను న్యూస్) : జనసేన పార్టీ బలోపే తానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని రాష్ట్ర జనసేన పార్టీ కార్య దర్శి, పెందుర్తి నియోజకవర్గ ఇంఛార్జి తమ్మి రెడ్డి శివ శంకర్ కార్య కర్తలకు పిలుపు నిచ్చారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం స్థానిక సీతారామ కల్యాణ మండ పంలో జరిగిన క్రియా శీలక సభ్యత్వ కిట్లు పంపిణీకి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 10,11,12తేదీల్లో నియోజక వర్గంలో కార్యకర్తలకు సభ్యత్వ కిట్లు పంపిణి చేశారన్నారు. నియోజక వర్గంలో 3200 మంది కార్యకర్తలకు భీమా సౌకర్యం కల్పించామన్నారు. ఎవరైనా కార్యకర్త ప్రమాద వశాత్తు గాయాలైతే 50 వేల రూపాయలు, మరణిస్తే ఐదు లక్షల భీమా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కార్యకర్తలకు సభ్యత్వ కిట్లు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మామిడి శంకరరావు, మామిడి రామారావు, పీలా రామకృష్ణ,పిన్నింటి పార్వతి, కన్వీనర్ కర్రి కనకరాజు,కో కన్వీనర్ సబ్బవరపు రవి,సేనాపతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్లీలత నృత్యాలు చేసిన వారిపైకేసు నమోదు

భీమునిపట్నం : భీమిలీ మండలం అమనాం గ్రామంలో మహిళల తో అశ్లీలత నృత్యాలు వేయించడంపై పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం ఈనెల 3న జరిగిన గ్రామ దేవత అమ్మవారి పండగల గ్రామ కమిటీ సభ్యులు చుక్క చిట్టి బాబు, జీరు మురళి,కాళ్ళ గౌరీ శంకర్,చుక్క రమణ లు బుర్రకథ పేరుతో స్టేజి పర్మిషన్ తీసుకోకుండా రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేసారనీ చెప్పారు. బుర్రకథ పేరుతో మహిళ లతో అసభ్యంగా డాన్సులు వేయించడమే కమిటీ మెంబర్లు కూడా వారితో పాటు అసభ్యంగా డాన్సులు చేసారనీ తెలిపారు. దీనిపై చుక్కల పల్లారెడ్డి, వేముల వెంకటేష్,ఇద్దరు మహిళలుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నేటి నుంచి దక్షిణ భారత అంతర వర్సిటీల మహిళల క్రికెట్ టోర్నీ మహిళల క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్ర విశ్వవిద్యా లయం స్పోర్ట్సు బోర్డు ఆధ్వ్యంలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల మహిళల క్రికెట్ చాంపియన్ షిప్ నిర్వహి స్తున్నట్టు ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్. విజయ్మోహన్ తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ బోర్డు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాటాడుతూ ఐదు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో సౌత్జోన్లోని 16 విశ్వవిద్యాలయాల జట్లు పాల్గొంటాయని తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## ప్రభుత్వానిదే బాధ్యత

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం అనూహ్యంగా పడిపోవడం తీవ్ర ఆందోళనకరం. రాష్ట్ర వ్యాప్తంగా 6,15,908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 2,01,627 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. అంటే దాదాపుగా 33 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదు. గడిచిన 20 ఏళ్ల కాలంలో ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరీక్ష తప్పడం ఇదే మొదటిసారి. 71 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేదు. 31 ప్రైవేటు, 18 ఎయిడెడ్ పాఠశాలలు కూడా సున్నా శాతంతో సరిపెట్టాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా విద్యారంగ పరిస్థితి ఇంత దయనీయంగా మారడానికి కారణం ఏమిటి? కారణం ఏదైనా పెద్ద సంఖ్యలో విద్యార్థులపై దీని ప్రభావం పడింది. సప్లిమెంటరీ పరీక్షలను జులై నెలలోనే నిర్వహించి, రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా కళాశాలల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ఈ విషయం ఎలా ఉన్నప్పటికీ, విద్యార్థులు తీవ్ర మానసిక సంఘర్షణ ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కరోనా కారణంగా గత రెండు సంవత్సరాల్లోనూ పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులను పాస్ చేశారు. ఈ ఏడాది పదవ తరగతి రాసిన విద్యార్థులపై కూడా కరోనా ప్రభావం తీవ్రంగా ఉంది. ఎనిమిది, తొమ్మిది తరగతులను వీరు పాఠశాల ముఖం చూడకుండానే దాటేశారు. అన్‌లైన్‌లో బోధన జరిగిందని చెబుతున్నప్పటికీ అవి అరకొర చదువులే! ఆన్‌లైన్ చదువుల బండారాన్ని ఎన్నో సర్వేలు బట్టబయలు చేశాయి. ఆగస్టులో బడులు ప్రారంభమైనప్పటికీ వ్యాక్సినేషన్లకు అనుమతిచ్చేంతవరకు కరోనా భయం వెంటాడుతూనే ఉండింది. నిజానికి ఇప్పటికి కూడా వైరస్ భయం పూర్తిగా తొలగలేదు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులపైనా, విద్యాబోధనపైనా ఏ స్థాయిలో శ్రద్ధ తీసుకుని ఉండాలి! కానీ, జరిగిందేమిటి? టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయుల కొరత వెంటాడింది. దాదాపుగా 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఒక అంచనా! ఈ సంఖ్య ఇంకా ఎక్కువ కూడా ఉండవచ్చు. ఇది చాలదన్నట్టు బోధనతో సంబంధంలేని ఎన్నో పనులను ఉపాధ్యాయులపై మోపారు. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ పనుల వివరాలు యాప్‌లలో నింపేటప్పటికే పుణ్యకాలం గడిచిపోతోందంటూ గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఉపాధ్యాయులపై పెరిగిన పని భారాన్ని తగ్గించేందుకు ఎటువంటి చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదు. ఇవి చాలవన్నట్టు నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాలల విలీనం పేరుతో గందరగోళం సృష్టించింది. తరలింపు ప్రక్రియను ఈ ఏడాదే ప్రారంభించింది. ఇన్ని ఒత్తిళ్ల మధ్య ఉపాధ్యాయులు బోధన సాగించినా ఏకపక్షంగా ప్రారంభించిన ఇంగ్లీష్ మీడియం చదువుల ప్రభావమూ ఈ ఏడాదే కనిపించింది! ఎయిడెడ్ రంగంలో సంస్కరణల పేరిట కొన్నింటిని మూసివేయడానికి అనుమతించడం... మరికొన్నింటిని ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించడం వంటి చర్యలు విద్యార్థులపై ఒత్తిడి పెంచాయి. బడుల పరిరక్షణ కోసం కరోనా సమయంలోనూ విద్యార్థులు ఆందోళనలు చేయాల్సి వచ్చింది. ఇక పరీక్షల సందర్భంగా యథేచ్ఛగా జరిగిన పేపర్ లీక్‌లు కూడా విద్యార్థులపై ప్రభావం చూపాయి. ఈ విషయాలన్నింటికి, వాటి ఫలితంగా చోటు చేసుకుంటున్న అన్ని దుష్పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. పదవ తరగతి ఫలితాలు తగ్గడం కూడా వాటిలో ఒకటి.

పరీక్ష తప్పామన్న అందోళనతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రాష్ట్రంలో ముగ్గురు విద్యార్థులు బలవన్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు ఇళ్ల నుండి అదృశ్యమైనారు. పరీక్షలు జీవితంలో భాగమే కానీ, అవే జీవితం కాదు! ఈ విషయాన్ని విద్యార్థులతో పాటు, వారి తల్లితండ్రులకు అర్థమయ్యేలా చెప్పాలి! ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. విద్యార్థులు విద్యా సంవత్సరంతో పాటు, మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా ఉండటానికి అవసరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలి. ఇప్పటికైనా ఏకపక్ష ధోరణులు వీడి, మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ ఎంఎల్‌సిలతో పదవ తరగతి ఫలితాల తీరుపై విస్తృతంగా చర్చించి తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

విద్యారంగాన్ని పటిష్టపరచడంలో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశలో అడుగులు వేస్తే ఉపాధ్యాయులు, విద్యార్థులపైన ఒత్తిడి లేకుండానే అత్యుత్తమ లక్ష్యాలను అందుకోవడం అసాధ్యమేమి కాదు.

# టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గా కోడూరి సుశీల



సీతమ్మధార (విజయభాను న్యూస్): విశాఖపట్నం టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు కోడూరి సుశీల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఈ పదవి రావటానికి సహకరించిన పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ కి మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు కి సుశీల ధన్యవాదములు తెలిపారు.

# భావాలు వ్యక్తపరచటమే చిత్రలేఖనం

- రోడ్లు, భవనాల శాఖ ఏఇ పి.శ్రీనివాసరావు



అనకాపల్లి : భావాలు, ఆలోచనలను వ్యక్తపరచటమే చిత్రలేఖనమని రోడ్లు, భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో శనివారం జరిగిన చిత్రలేఖనం ఉచిత శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దృశ్యకళలో చిత్రలేఖనానికి తగు ప్రాముఖ్యత ఉందన్నారు. చిత్రపటాన్ని గీయటం, కూర్పులే కాకుండా సహజత్వం, ప్రాతినిధ్యం, ఛాయాచిత్రం, నైరూప్యం, కథనం, ప్రతీకాత్మకం, భావోద్రిక్తం, రాజకీయం, సంజ్ఞ, కథనం చిత్రలేఖనంలో కీలక పాత్రలు పోషిస్తాయన్నారు. చిత్రలేఖనం ఊహకి రూపాన్ని ఇచ్చే ఒక చక్కని సాధనమన్నారు. ఈ కళకు పరిమితులు లేవని, చిత్రలేఖనానికి వివిధ రూపాలు ఉన్నాయన్నారు. సహజత్వాన్ని ప్రతిబింబించే చిత్రలేఖనం ఒక వైపు అయితే కల్పిత లోకాలలో విహరించేది మరొక వైపు అన్నారు. భావ వ్యక్తీకరణ, మానవ చరిత్ర, సంప్రదాయాలు, జీవనశ్కైలి, వ్యవస్థ ఇలా దేనిన్కైనా ఆవిష్కరించగలిగే చిత్రలేఖనం, మానవుని అభివృద్ధిలో కీలకమైన కళన్నారు. చిత్రలేఖన చరిత్రలో కొంత భాగాన్ని ఆధ్యాత్మిక భావాలే నడిపించాయని శ్రీనివాసరావు అన్నారు. చిత్రలేఖనం సత్యాన్ని సాక్షాత్కరించలేవని, సత్యం ప్రతిబింబాన్ని మాత్రమే అవిష్కరించగలవని. ఈ శిక్షణను గత నెల 22 నుంచి నిరవధికంగా శ్రీ గౌరీ గ్రంథాలయం నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత నేపథ్యం, పేద కుటుంబాల నుండి వచ్చే విద్యార్థుల అభిరుచిని బట్టి నైపుణ్యాన్ని వెలికితీసే ఉద్దేశ్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యక్రమం సమన్వయకర్త మళ్ల బాపునాయుడు, శిక్షకులు చదరం రామచంద్ర, శరకడం విజయలక్ష్మి, బి.అనురుద్, గ్రంథాలయ సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు, అనంతరం శిక్షకులను గ్రంథాలయం ఘనంగా సత్కరించింది.



# సమయం కవి

## స్నేహితుడు

నా స్నేహితుడు వరం
మూడ్ ఎప్పుడూ గరం గరం
గర్ల్‌ఫ్రెండ్‌తో ఆడుతుంటాడు సరసం
చదువంటే విరసం
నచ్చిన వంటకం పాయసం
ఎప్పుడూ చెప్పించుకుంటాడు జోస్యం
బలాదూర్ గా తిరగడం ఇష్టం
తెస్తాడు ఇంటికెంతో కష్టం
చేసిన ప్రతీ వ్యాపారంలో నష్టం
ఏ పనికి వుండకూడదు ఇష్టం

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

| మాసం : జ్యేష్ఠ; తిథి:త్రయోదశి రా.10.07; విశాఖ రా.10.14; ఉ.శే.వ.6.10వ రా.వ.2.00ల 3.31. | ఆదివారం 12 -06-2022 |
|---|---|

**a మేషం :** దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహ కారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం.

**b వృషభం :** నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.

**c మిథునం :** కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం.

**d కర్కాటకం :** విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం.

**e సింహం :** ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి.

**f కన్య :** భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

**g తుల :** మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం.

**h వృశ్చికం :** నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక ప్రకటన మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది.

**i ధనుస్సు :** నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. కొత్త ఆదాయ మార్గాలు అన్వేషిస్తారు. విలువైన వస్తువులపై దృష్టి సారిస్తారు. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు.


**j మకరం :** దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభా కాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం.

**k కుంభం :** ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసివస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

**L మీనం :** పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

## సంకీర్తన



రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీత వృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీన జాతి వాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామ చంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రీతరక్షణ వల్ల లభించి నయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్న వాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరిం పచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవం తుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్న వాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా - సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ-భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది.


వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి.

మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమానమైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.

## నూతన కార్యవర్గానికి అనంతగిరి యుటిఎఫ్ మండల శాఖ అభినందనలు



అనంతగిరి (విజయభాను న్యూస్) : పాడేరులో జరిగిన అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ జిల్లా ఎన్నికలలో నూతనంగా ఎన్నిక అయిన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్య దర్శులకు మరియు జిల్లా కార్య వర్గ సభ్యులకు అనంతగిరి మండల యుటిఎఫ్ శాఖ సభ్యులందరము అభినందనలు తెలియజేయుచున్నాము.



89 వ వార్డు గోపాలపట్నం కొత్తపాలెం లో శనివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు బెహరా భాస్కరరావుని ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త వెంకటరమణ, ఆళ్ల పైడ్రాజు, జి.ఎమ్.నాయుడు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ ఏర్నిదుర్గమాంబను దర్శించు కున్న నగర మేయర్ దంపతులు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : శ్రీ ఏర్ని దుర్గమంబ చల్లని దీవెనలు మన అందరిపై ఉండాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె తోటగరువు లో కొలువై ఉన్న శ్రీ ఎర్ని దుర్గమంబ వార్షికోత్సవ మహోత్సవంలో తొలయేళ్ళు సంబరాల్లో పాల్గొని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మేయర్ దంపతులను సాధారణంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తోట గరువు ఇలవేలుపు శ్రీ ఏర్ని దుర్గమంబ అమ్మవారి తల్లి చల్లని దీవెనలు నగర ప్రజలపై ఉండాలని, నగర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, నగర అభి వృద్ధికి చెందేటట్లు కరుణించాలని కోరుకుం టున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొల్లి అప్పల రాజు, జగ్గారావు, శ్రీను, స్థానిక భక్తులు తది తరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీకి గురయిందని ఫిర్యాదు

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : తన ఇంటిలో బంగారం చోరీకి గురైనట్లు భీమునిపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు అందిందనీ పోలీ సులు తెలిపారు. వివ రాలిలా ఉన్నాయి. తగరపువలస,గాంధీ బొమ్మ దగ్గర నివాసం ఉంటున్న మర్రిశెట్టి శంకర్రావు కుటుంబం గురువారం రాత్రి తన ఇంట్లో హాల్ లో కిటికీ తెరచి పడుకున్నారు. 2 తులాల బంగారు పుస్తెలతాడు, 2 ఫోన్లు తల దగ్గర పెట్టుకుని పడుకున్నారు. అయితే తెల్ల వారుజామున 3గంటల ప్రాంతంలో శంకర్రావు భార్య లేచి చూసేసరికి పుస్తెలతాడు, ఫోన్ లు పోయాయనీ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుని వెల్లి పోయారనీ అనుకున్నారు. దాంతో శుక్రవారం భీమునిపట్నం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసారు.

అయితే వాటి విలువ 55 వేల రూపాయలు విలువ ఉంటుందనీ క్రైం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. శంక ర్రావు ఫిర్యాదు మేరకు క్రైం ఎఎస్ఐ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జగనన్న ప్రభుతం ప్రవేశపెట్టిన పథకాలతో గర్భిణులు, చిన్న పిల్లలకు

## సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం లభిస్తుంది

### జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వైయస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుతం ప్రవేశపెట్టిన పథకాలతో గర్భి ణులు, చిన్న పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికా హారం లభిస్తుందని జీవీఎంసీ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. వార్డు పరిదిలో నేరెళ్ల కోనేరు అల్లిపురం అంగన్వాడీ కేంద్రం లో గర్భిణీలకు వైయస్సార్ సంపూర్ణ ఆహారాన్ని అంద చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి కడుపులో పెరుగుతున్న బిడ్డను ఊహించుకుంటూ ఎన్నోకలలు కంటారని పేదరికం మూఢనమ్మకాలతో పౌష్టికాహా రానికి దూరమై రక్తహీనత బారిన పడి ప్రాణం మీదకు తెచ్చుకుంటు న్నారన్నారు. బలహీనంగా పుట్టే బిడ్డ ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని గుర్తించిన ముఖ్యమంతి జగన్మోహన్రెడ్డిగారు ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ...

తల్లీబిడ్డ ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారని కొనియాడారు. వార్డులోని మహిళలు ఈ అవకాశాన్ని సద్విని యోగంచేసుకోవాలని నాగరాజు గారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తులసి, పండు, డాల్ఫిన్ శంకర్, ఉమా , జానకి తదితరులు పాల్గున్నారు.

## ఉపాధి, శిక్షణ, సేవ, లక్ష్యంగా మణి భూషణ్ 'రాబ్ గ్రూప్ ఇండియా' ప్రారంభం



అనంతగిరి (విజయభాను న్యూస్) : నగరానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ మరియు టీవీ టూరిజం అదినేత మరియు ప్రముఖ దర్శకుడు జాతీయ అవార్డు గ్రహీత మణి భూషణ్ గారి చేతులమీదుగా ప్రముఖుల సమక్షం లో టీవీ టూరిజం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ లో ఉపాధి, శిక్షణ, సేవ లక్ష్యంగా మణి భూషణ్ రాబ్ గ్రూప్ ఇండియా అనే సంస్థను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు మణి భూషణ్ మాట్లాడుతూ విశాఖ పర్యాటక అభివృద్ధి లో వినూత్న ప్రణాళికలతో ఎన్నో చిత్రాలను , పుస్తకాలను, పాటలను, ప్రముఖుల జీవితాలను, ప్రతిభను , ప్రకృతిని, సనాతన హిందూ ధర్మాన్ని, భాష, కళ, వేదం, సంస్కృతి, చరిత్ర, సాంప్రదాయా లను,గిరిజన కట్టుబాట్లను, పర్యావరణం, జీవ వైవిధ్య ప్రయత్నం, సమాజ హితం, సామజిక చైతన్య, మానవత్వపు మనుష్యుల అసాధారణ సేవలను ప్రపంచ పర్యాటకులకు టీవీ టూరిజం ద్వారా అందజేయడం మాకు దక్కిన వరం అని, ఇప్పుడు కరోనా లాంటి వైరస్ లు ఎప్పుడు దాడి చేస్తోయో అని భయం తో బ్రతికే వారికీ సమాధానం చెప్పే పరికరం అందుబాటులోకి వచ్చిందని , రాబ్ గ్రూప్ ఇండియా , స్టార్ట్ అప్ ఇండియా లో భాగంగా ఆ పరికరం పై అందరికి అవగహన కల్పించే అవకాశం వచ్చిందని , ప్రతి ఒక్క ఇంటిలో ఆ పరికరం ఉంటె ఎలాంటి వైరస్ లేదా బాక్టీరియా అయినా గాలి నుండి వేరు చేసి చంపి పూర్తి రక్షణ ఇస్తుంది అని, ఈ సంస్థ ద్వారా ఎవరైనా ఏ వయసు వారైనా నిరుద్యోగ యువతీ యువకులకు వీరు నడిపే రంగాల్లో ఉపాధి , శిక్షణ , సేవ ఉచితంగా ఇస్తామని ఈ ప్రొడక్ట్ డెమో కొరకు మరియు ఉపాధి కొరకు 24 గంటల హెల్ప్ లైన్ 9848418582 వివరాలు పొందవచ్చు. ఇది నిజంగా అందరి భాగస్వామ్యం తో చేసే అతిపెద్ద సేవ అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మణి భూషణ్ ఏమి చేసిన సమాజానికి ఉపయోగపడే పని చేస్తారని, దేశం లో పర్యాటక రంగ అభివృద్ధికి నిస్వార్ధంగా సేవ చేస్తున్న ఏకైక వ్యక్తి అని , వీరి సేవలు అందరు వినియోగించుకోవాలని కోరుతూ, టీవీ టూరిజం మరింత విలక్షణంగా విజయాపదం లో దూసుకుపోవాలని ప్రతి సంవత్సరం ఉన్నత శిఖరాలను అందుకునే దిశగా మణి భూషణ్ ప్రయాణించాలని ఆశీర్వదించారు. మరో అతిధి సన్ మూర్తి మాట్లాడుతూనిర్విరామంగా విశాఖ అందాలను తనదైన శైలి లో ప్రపంచ పర్యాటకులకు చూపిస్తూ , పర్యాటక అంటే మణి భూషణ్ అని పేరు సార్ధకత చేసుకున్న దర్శకుడు , ఈ రోజు ఆవిష్కరించిన రాబ్ గ్రూప్ ఇండియా ద్వారా మరిన్ని సరికొత్త ఆవిష్కరణల కు వేదిక ఏర్పాటు చేసి తోలి ప్రయత్నంగా వైరస్ ను అంతం చేసే పరికరం అందరికి అందుబాటులోకి అవగహన కలిపించే దిశగా ఉపాధి,శిక్షణ, సేవ అనే నినాదం తో ఏర్పాటు కావడం అభినందనీయం అని కొనియాడారు.ఈ కార్యక్రమ లో సీఈఓ సీతారామ స్వామి , ఎడిటర్ నీరజభూషణ్, హీరో నిర్మాత ఆదిత్యభూషణ్ కెమెరా కిషోర్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ చందు, బలీరెడ్డి సూర్యారావు, సత్యం నాయుడు , ఆనందరావు , మహేష్ , ఈమంది శ్రీనివాస్ , ప్రసాద్ , అడ్మిన్ సత్యవాణి , రిసెప్షన్ సీత రత్నం మరియు టీవీ టూరిజం టీం తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మధుర గాయకులకు స్వర నివాళి నేడు

### పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ ఎంవివి.సత్యనారాయణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సరాగ మాలిక సంగీత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12 న హలో నేస్తం.. బాగున్నావా శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు సంస్థ అధినేత్రి పి. సూర్యకుమారి తెలిపారు. శనివారం ఉదయం లాసెన్స్ బే కాలనీలోని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో కార్యక్రమానికి సంభందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ సరాగ మాలిక ఆర్కెస్ట్రా అధినేత పి.ఎస్.ఎస్. కుమార్, వివి నాయుడుల స్మారకార్ధంగా ఈ నెల 12 వ తేదీ సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళా భారతి ఆడిటోరియం హల్లో నేస్తం బాగున్నారా శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈటీవీ యాంకర్, సినీ గాయని విజయలక్ష్మి, అమ్మపండు డాట్ కం సింగర్ చింతలపాటి అమ్మ పండు, ప్రముఖ వైద్యుడు ఎన్ వి కిరణ్ కుమార్, రమేష్ పట్నాయక్, బీవీ హరి కిషోర్, శ్రావ్య, సునీత తదితరులు పలు గీతాలు ఆలపిస్తారని చెప్పారు. అంతర్జాతీయ షెటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బీ.వీ.ఎస్.కె. లింగేశ్వర రావు సౌజన్యంతో జరగనున్న కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జీవీఎంసీ కమీషనర్ డా.జి. లక్ష్మీశా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ నాగిరెడ్డి లు హాజరు కానున్న సభలో నంది అవార్డు గ్రహీత రాంభట్ల నృసింహ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారని కుమారి తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో రమేష్ పట్నాయక్, బి.వి.ఎస్.కె. లింగేశ్వర రావు, బాదంగీర్ సాయి, చెన్నా తిరుమలరావులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్ ) : జనం కోసం సిపిఎం ఇంటింటికీ సిపిఎం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజాసమస్యలు తెలుసుకొను కార్య క్రమంలో భాగంగా శనివారం హరిపాలెం గ్రామంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం ప్రారంభించారు . నిత్యా వసర వస్తువుల ధరలు గ్యాస్, పెట్రోల్ ,డీజిల్, వంట నూనె, సిమెంటు ఐరన్ ,బస్ చార్జీలు ,కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోవడంతో బ్రతకడం చాలా కష్టంగా ఉందని, ప్రైవేట్ స్కూల్స్ లో దళితులకు ఉచితంగా చదువు చెప్పే వారిని నేడు అది అమలు కావడం లేదన్నారు . భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేసే వారని నేడు అమలు చేయడం లేదని ,డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛను ఇవ్వడం లేదని గ్రామంలో తాగునీరు తాగడానికి పనిచేయడం లేదని మంచినీరు అందించాలని ,చదువుకున్న యువకులకు ఉద్యోగాలు ఉపాధి దొరకడం లేదని ప్రజలు తెలియజేసినట్లు తెలిపారు . పై సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్ రాము ,హరిపాలెం సిపిఎం నాయకులు ఎస్ కన్నుము నాయుడు, కే రాము, సదాశివరావు, సిపిఎం సీనియర్ నాయకులు కర్రీ అప్పారావు, జోగి నాయుడు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పెదగంట్యాడలో బీజేపి విశ్వాస్ ర్యాలీ రచ్చబండ

### పాల్గొన్న కేఎన్ఆర్ ఉమామహేశ్వరరావు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నరేంద్ర మోదీ ఎనిమిదేళ్ల పాలన సేవా సుసాసన్ గరీభ్ కళ్యాణ్ లో బాగంగా పెదగంట్యాడ సెంటర్ లో రాష్ట్ర ఎస్.సి మోర్చా కార్యవర్గ సభ్యులు ములకలపల్లి ప్రకాష్ ఆద్వర్యంలో విశ్వాస్ ర్యాలీ మరియు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా బీజేపి గాజువాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు ఎస్ సి మోర్చా రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగ నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి పిలుపు మేరకు గాజువాక నియోజకవర్గంలో ప్రతి మండలంలో జూన్ నెల 15వ తేదీ వరకు దేశ ప్రదాని మోదీ ఎనిమిదేళ్లలో సాదించిన విజయాలు ,సంక్షేమ పతకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రతి నాయకులు కార్యకర్త కనీసం 75 గంటలు పార్టీకి కేటాయించి ప్రజలను కలసి కష్టసుఖాలను తెలుకోవాలని జాతీయ పార్టీ పిలుపు మేరకు కేంద్ర మంత్రులు ఎంపిలు కూడ పర్యటిస్తారని చెప్పారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రదాని మోది ఎస్ సి ఎస్.టి లకు ఎంతో గౌరవిస్తున్నారని వారి సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పతకాలు పెట్టారని దేశ రాష్ట్రపతి పదవి కూడ ఇచ్చిన గణత బీజేపికే దక్కుతుందని అన్నారు. మొదట రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘణ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు విజయ్ కుమార్,విజయలక్ష్మి , కిలాని ముసలయ్య, గురప్ప, కట్టా పద్మ ,వెంకటరమణ ,బొండా యల్లాజీరావు,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## బ్లాక్ రైస్ తిన్నారా ఎప్పుడైనా?
# ఇందులో ఉండే పోషకాల గురించి తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు





వైట్ రైస్ తెలుసు.. కానీ ఈ బ్లాక్ రైస్(నల్ల బియ్యం) ఏందబ్బా అంటారా? అందరూ తినేది వైట్ రైసే. కానీ.. దాంట్లో ఉండే పోషకాల కంటే కూడా బ్లాక్ రైస్‌లో చాలా పోషకాలు ఉంటాయి. అందుకే.. బ్లాక్ రైస్‌ను తింటే చాలా రకాల వ్యాధులకు చెక్ పెట్టొచ్చు. అంతా బాగానే ఉంది కానీ.. ఈ బ్లాక్ రైస్ ఎక్కడ దొరుకుతుంది అంటారా? పదండి.. ఇంకాస్త వివరంగా బ్లాక్ రైస్ గురించి తెలుసుకుందాం.

గత రెండు మూడేళ్ల నుంచే దేశ వ్యాప్తంగా రైతులు బ్లాక్ రైస్‌ను పండిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు చోట్ల బ్లాక్ రైస్‌ను పండిస్తున్నారు. కాకపోతే.. చాలా తక్కువ ఎకరాల్లో ఈ పంటను ప్రస్తుతం పండిస్తున్నారు. అయితే.. కొన్ని కిరాణా, బియ్యం కొట్టుల్లో బ్లాక్ రైస్‌ను అమ్ముతున్నారు. కాకపోతే సాధారణ బియ్యం కన్నా.. బ్లాక్ రైస్ ధర మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది.

ఉదాహరణకు.. వైట్ రైస్ 50 రూపాయలకు కిలో ఉంటే.. బ్లాక్ రైస్ మాత్రం రూ.200 వరకు కిలో ఉంటుంది. అందుకే.. చాలామంది ఈ బియ్యాన్ని కొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కాకపోతే.. ఈ బియ్యంలో ఉండే పోషకాల వల్ల.. ఈ బియ్యాన్ని తింటే ఆరోగ్యపరంగా చాలా లాభాలు ఉంటాయి.

బ్లాక్ రైస్‌లో ఉండే పోషకాలు ఏంటి?

బ్లాక్ రైస్ చూడటానికి నల్లగా ఉంటాయి. ఒక వంద గ్రాముల బ్లాక్ రైస్‌ను తీసుకుంటే.. అందులో 8.5 గ్రాముల ప్రొటీన్లు, 3.5 గ్రాముల ఐరన్, 4.9 గ్రాముల ఫైబర్, 8.5 గ్రాముల ప్రొటీన్స్ ఉంటాయి. కోసైనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. అవి శరీరంలో ఇమ్యూనిటీని పెంచుతాయి. అలాగే షుగర్ వ్యాధిగ్రస్తులకు ఈ బియ్యం మంచి ఔషధంలా పనిచేస్తాయి. విటమిన్స్, ఖనిజాలు బ్లాక్ రైస్‌లో ఎక్కువగా ఉంటాయి. షుగర్‌తో పాటు క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా బ్లాక్ రైస్ నివారిస్తుంది. ఇందులో ఉండే ఔషధ గుణాల వల్ల ఈ బియ్యాన్ని ఆయుర్వేద మందు తయారీలోనూ ఉపయోగిస్తారు.

మీకు ఇంకో విషయం తెలుసా? ఈ బ్లాక్ రైస్‌ను రైతులు రసాయనాలు వేసి పండించరు. సహజసిద్ధంగా పండిస్తారు. వీటికి రసాయనాల అవసరం లేకుండానే సేంద్రీయ ఎరువులతో వీటిని పండించడం వల్ల ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చుతాయి.




## బరువు తగ్గాలా..?
# ఈ చిట్కాలు పాటించండి..!



చాలా మంది కొంచెం లావు అయితే చాలు అయ్యో చాలా లావు అయిపోయామని హైరానా పడిపోతుంటారు. శరీరం నాజుగ్గా ఉంచుకోవడం కోసం కొంత మంది ప్రయత్నిస్తే.. మరి కొంతమంది ఆరోగ్యం కోసమంటారు. ఇంకొంత మంది సెక్సీగా కనబడటానికి అంటుంటారు. వయసుకు మించిన బరువు ఉండటం మన ఆరోగ్యానికి హానికరం. ఇందుకోసం తిండి మానేస్తుంటారు. డైటింగ్ చేస్తుంటారు. ఫలితంగా ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటారు. డైటింగ్ చేయకుండా, తిండి మానేయకుండా శరీరం బరువు తగ్గాలంటే ఈ చిట్కాలు పాటించండి.

ఆహారంలో ఉప్పు, చక్కెరను వీలైనంత తక్కువగా వాడేలా చూసుకోవాలి. ఇది శరీరం బరువు కోల్పోయే ప్రక్రియను సులభతరం చేస్తుంది. మార్పులు కూడా త్వరగా కనిపిస్తాయి. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిలుపుకునే సమస్య ఏర్పడి శరీరంలో వాపు సమస్య వస్తుంది. ధాన్యాల కన్నా చక్కెరలు మన శరీరంలో కొవ్వును ఐదు రెట్లు వేగంగా పెంచుతుందని పరిశోధనలు చెప్తున్నాయి. అందుకని ఉప్పు, చక్కెరలు తగ్గించడం ద్వారా శరీరం బరువును తగ్గించుకోవచ్చు.



నీరు దివ్యౌషధం. ఎంత ఎక్కువగా నీరు తాగితే అంత ఆరోగ్యంగా ఉంటాం. సాధారణంగా డ్రింక్స్ అంటే మనలో చాలా మంది ఎక్కువగా పంచదార కలపిన జ్యూసులు, సోడా, ఎనర్జీ డ్రింక్స్ తాగడంపై ఆధారపడతారు. దాంతో శరీరంలో అదనంగా మరి కొంత కొవ్వు ఏర్పడు తుంది. అలా కాకుండా నీళ్ళను ఎక్కువగా తాగడం అలవాటు చేసుకోవాలి. నీళ్లు తాగడం వల్ల సైడ్ ఎఫెక్ట్సు ఉండవు. రక్తంలోని సోడియం నిల్వలు పల్చ బడతాయి. అయితే, ఒకేసారి ఎక్కువగా తాగకుండా.. కొంచెం కొంచం తాగుతూ ఉండాలి.

సరైన ఆహారాన్ని సరైన సమయానికి తినడం కూడా మనకు ఆరోగ్యాన్ని తెచ్చిపెడుతుంది. తినే సమయాన్ని సరిచేయడం ద్వారా ఆ సమయంలో ఆకలిని నియంత్రించగలుగుతాం. తినే సమయాలను నిర్ణయించకపోతే ఏదైనా తినడం అలవాటు అవుతుంది. దీనివల్ల కొవ్వు పెరుగుతుంది. అలాకాకుండా నిత్యం ఒకే సమయానికి తినడం అలవాటు చేసుకోవాలి. ప్లేట్‌లో సమతుల్య ఆహారం ఉండేలా చూడాలి. నిత్యం పండ్లు తినడం చాలా మంచిది. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాలను తినడం వల్ల ఆకలి వేయకుండా శరీరం బరువు తగ్గించుకోవచ్చు.

ఇక నిద్ర కూడా మన శరీరం బరువును నియంత్రించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. నిద్ర లేకపోవడం ఊబకాయానికి దారితీస్తుంది. అలాగే దినచర్యను పాడు చేస్తుంది. నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో బరువును నియంత్రించే లెప్టిన్ అనే హార్మోన్ స్థాయి తగ్గుతుంది. ఊబకాయం వేగంగా పెరుగుతుంది. అందుకని ప్రతిరోజూ 6 నుంచి 7 గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి.



శరీరం బరువు తగ్గించుకోవడంలో వ్యాయామానికి పెద్ద పాత్ర ఉన్నది. అందుకని వ్యాయమం చేయడాన్ని మిస్సవ్వద్దు. రన్నింగ్, జాగింగ్, స్కిప్పింగ్ వంటి వ్యాయామాలు.. శరీరం బరువు తగ్గించడంలో కీలకంగా పనిచేస్తాయి. ప్రభావం కూడా చాలా వేగంగా ఉండి ఎక్కువ కాలం ఉంటుంది. దుమ్ము దులపడం, కడగడం, తోట పని చేయడం, నీళ్లు నింపడం వంటి ఇంటి పనులను చేయడం ద్వారా చాలా క్యాలరీలు కరిగించుకోవచ్చు.

## చాక్లెట్ కేక్



**కావలసిన పదార్థాలు: గోధుమ పిండి- కప్పు, కొకొ పౌడర్ - ఆరు స్పూన్లు, బాదం పాలు- పావు కప్పు, చక్కెర - పావు కప్పు, ఉప్పు- చిటికెడు, చల్లని నీళ్లు - కప్పు, సన్‌ఫ్లవర్ నూనె- రెండు స్పూన్లు, బేకింగ్ పౌడర్ - స్పూను, నిమ్మరసం- స్పూను.**

తయారుచేసే విధానం: బేకింగ్ పాన్ లోపల భాగమంతా నూనె రాయాలి. ఓ గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు కలిపి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో చక్కెర, నీళ్లు వేసి బాగా కలపాలి. చక్కెర అంతా కరిగాక నూనెను కూడా వేసి మళ్లీ కలపాలి. ఆ తరవాత నిమ్మరసం జతచేయాలి. ఇందులోనే గోధుమ పిండి, బేకింగ్ పౌడర్ వేసి అంతా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని బేకింగ్ పాన్‌లో వేసి ఉడికిస్తే కేక్‌గా మారుతుంది. ఓ చిన్న గిన్నెలో నూనె, బాదం పాలు, చక్కెర వేసి వేడిచేయాలి. చక్కెరంతా కరిగాక కొకొ పౌడర్‌ని కలపాలి. అంతా కలిశాక స్టవ్ కట్టేయాలి. ఈ వేడి ద్రవాన్ని కేక్ మీద, అంచుల మీద పోయాలి. చల్లారాక ఫ్రిజ్‌లో రెండు గంటలు పెడితే చాక్లెట్ కేక్ రెడీ.

## స్పాంజ్ కేక్



**కావలసిన పదార్థాలు: కోడిగుడ్లు - నాలుగు, పిండి - ముప్పావు కప్పు, పంచదార పొడి - ముప్పావు కప్పు, వెనీలా ఎసెన్స్ - అర టీస్పూన్, బేకింగ్ పౌడర్ - అర టీస్పూన్, బట్టర్ పేపర్.**

తయారీ విధానం: బట్టర్ పేపర్‌ను టిన్ సైజుకు తగినట్టుగా రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి. తరువాత టిన్ అడుగు భాగాన బట్టర్ పేపర్‌ను పరచాలి. ఒక పాత్రలో కోడిగుడ్లు పగలగొట్టి అందులో పంచదార, వెనీలా, ఉప్పు, బేకింగ్ పౌడర్ వేసి బాగా కలియబెట్టాలి. ఇప్పుడు మరొక పాత్రలో పిండి తీసుకోవాలి. కోడిగుడ్ల మిశ్రమాన్ని పిండిపై పోయాలి. నెమ్మదిగా స్పూన్‌తో కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని టిన్‌లో తీసుకుని ఓవెన్‌లో బేక్ చేయాలి. చల్లారిన తరువాత కేక్ సర్వ్ చేసుకోవాలి.

# రామాయణం








### దశరథుని పుత్రకామేష్టి

సూర్యోదయం అయింది. వాల్మీకి ఆశ్రమానికి నారదమహర్షి విచ్చేశాడు. అతనికి అన్ని సపర్యలూ చేశాడు వాల్మీకి. తర్వాత ఇలా ప్రశ్నించా డతన్ని."మహర్షీ! లోకంలో పరాక్రమ, జ్ఞాన సద్గుణాల్లో సర్వశ్రేష్టుడు ఎవరు? అటువంటి వ్యక్తి ఉన్నాడా? ఉంటే దయచేసి అతని గురించి వివరించండి."సమాధానంగా సన్నగా నవ్వాడు నారదుడు."ఇది నా వేడుకోలు స్వామీ! అనుగ్రహిం చండి." చేతులు జోడించి నమస్కరించాడు వాల్మీకి. అతని హృదయవేదనను అర్థం చేసు కున్నాడు నారదుడు. చెప్పాడిలా."సద్గుణాల్లో సర్వశ్రేష్టుడు లేకనేం, ఉన్నాడు. అతని పేరు శ్రీరామచంద్రుడు. అయోధ్యను ఏలు తున్నాడు." అన్నాడు. తర్వాత రామకథను సంగ్ర హంగా వివరించి, వెళ్ళిపోయాడు అక్కణ్ణుంచి. నారదుడు చెప్పిన రామకథను పదేపదే మననం చేసుకున్నాడు వాల్మీకి. అద్భుతం, అమోఘం అను కున్నాడు. అంతలో శిష్యుడు భరద్వాజుడు వచ్చాడక్కడకి. ఇద్దరూ స్నానానికి బయల్దేరారు. తమసానదిని సమీపించారు. దారిలో ఓ చెట్టు మీద క్రౌంచపక్షుల జంటను గమనించాడు వాల్మీకి. చాలా ఉల్లాసంగా ఉన్నాయవి. ప్రేమో న్మత్తంగా ప్రవర్తిస్తున్నాయి. అంతలో ఓ బాణం వచ్చి జంటలోని మగపక్షిని కూల్చింది. ప్రాణాలు కోల్పోయి చెట్టుపై నుంచి కిందపడింది మగపక్షి. దానిని చూసి ఆడపక్షి రోదించసాగింది. చూశా డది వాల్మీకి.

జాలితో చలించిపోయాడతను. ఆవే దన చెందాడు. ఆ ఆవేదన ఆవేశమయింది. తల తిప్పి చూశాడిటు. తన బాణానికి నేల కూలిన పక్షికోసం పరుగున వస్తున్న బోయ కనిపించాడు. రక్తారుణనేత్రా లతో ఇలా శపించా డతన్ని. "మానిషాద ప్రతిష్ఠాం త్వ, మగమః శాశ్వతీం సమాః,యత్ క్రౌంచ మిథునాదేక, మవధీః కామ మోహితమ్."'"ఓయీ బోయా! ప్రేమోన్మత్తమై ఉన్న ఈ జంట పక్షులలో ఒకదాన్ని చంపిన కారణంగా కల కాలం నువ్వు అప్రతిష్ట పాలవుదువుగాక."ముని శాపానికి భయపడ్డాడు బోయ. అక్క ణ్ణుంచి పరుగందు కున్నాడు. భయపడి పారి పోతున్న బోయని చూసి, తల విదిల్చాడు వాల్మీకి. జాలి చెందాడు. శాంతించాడు. మథన పడ్డాడు. తనకేమయింది? ఎందుకిలా ప్రవర్తించాడు? అను కున్నాడు. తర్వాత శాపాన్ని తలపోశాడు. చక్కని పదాల పొందికతో, రెండు సమపాదాలతో, శ్లోకమయిన తన మాటలకు తానే విస్తు పోయాడు వాల్మీకి. ఆ మానసికావస్థలోనే శిష్యుని సహా స్నానం ముగించుకుని, ఆశ్రమానికి చేరు కున్నాడు. మౌనంగా కూర్చున్నాడక్కడ. కళ్ళు మూసుకున్నాడు. జరిగిన దాని గురించి ఆలో చించసాగాడు.ఎవరో వచ్చిన అలికిడి అయింది. కళ్ళు తెరచి చూశాడు. సృష్టికర్త, చతుర్ముఖుడు సాక్షాత్తు బ్రహ్మ. సాక్షాత్కరించాడక్కడ.

దేవతలతోనూ, ఋషులతోనూ తరలి వచ్చాడు. అతనికి చేతులు జోడించి, నమస్కరిస్తూ లేచి నిల్చున్నాడు వాల్మీకి."వాల్మీకీ! నువ్వేలాంటి పాపకార్యమూ చెయ్య లేదు. మంచిపనే చేశావు. చేసిన మంచిపనికి ఆనందించు. నా ఆదేశానుసారం, వాణి నీ వాక్కులో ప్రవేశించింది. దాని ఫలితమే శోకంతో నువ్వు పలికిన వాక్కు, శ్లోకరూపం దాల్చింది." అన్నాడు బ్రహ్మ. అవునా! అన్నట్టుగా ఆశ్చర్య పోయాడు వాల్మీకి."నారదుడు చెప్పిన రామకథను నువ్విందాక పలికావే శ్లోకం, ఆ శ్లోక ఛందస్సులోనే కావ్యంగా రచించు. అది లోకకల్యాణకారకమవుతుంది. తర తరాలూ వర్థిల్లుతుంది."ఆనందంతో చలించిపోయాడు వాల్మీకి."నా అనుగ్రహంతో రామకథలోని పాత్రలు ఏఏ పనులు చేపట్టిందీ, వారేం మాట్లాడిందీ, ఎలా ఆలోచించిందీ అన్నీ నీ దివ్యదృష్టికి అందు తాయి. అలా అందడమేకాదు, నా ఆశీస్సులతో నువ్వు రచించిన మహాకావ్యం ఈ విశ్వం అంతటా వ్యాపించి, కులపర్వతాలూ, సాగరాలూ, సూర్య చంద్రులూ ఉన్నంతకాలం వర్థిల్లుతుంది.

నీ కావ్యం సహా నువ్వు కూడా కీర్తిమంతుడ వవుతావు. తర్వాత మాలోకాన్ని అలంకరిస్తావు." అన్నాడు బ్రహ్మ. "దైవానుగ్రహం" అన్నాడు వాల్మీకి.తలవంచాడు. ఋషులూ, దేవతలుసహా బ్రహ్మఅదృశు ్యడయ్యాడు.

బ్రహ్మోపదేశానికీ, ఆదేశానికీ ఆనందించి, వాల్మీకి రామకథను రచించేందుకు సిద్ధమయ్యాడు. ధ్యానమగ్నుడయ్యాడు. రామకథ అంతా అతని కళ్ళకు బొమ్మ కట్టింది.

# కాలుష్యంతో.. కరుగుతున్న హిమశిఖరాలు



గత ఐదు దశాబ్దాల్లో హిమాలయ ప్రాంతంలో హిమనీ నదుల సంఖ్య పెరిగింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా హిమనీ నదులు తీవ్రంగా ద్రవీభవి స్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులు తీవ్ర పరిణామానికి సూచికగా పరిగణించాలని హిందూ కుష్ హిమాలయన్ (హెచ్‌కెహెచ్) సంస్థ పేర్కొంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపై తొలిసారి అంచనా వేసింది. వాతావరణ మార్పుల వల్లే మంచు, వర్షపు పోకడల్లో మార్పులు చోటుచేసు కుంటున్నాయని పరిశోధకులు గుర్తించారు. మానవాళి విచ్చలవిడిగా విడుదల చేస్తున్న హానికారక వాయువులతో హిమశిఖరాలు నిలువునా కరిగి పోతున్నాయి. ఉష్ణోగ్రతల్లో పెరుగుదల వల్ల హిమానీ నదాలు తరిగిపోయి, జలవిలయానికి కారణ మవుతున్నాయి.

తాజాగా ఐస్‌లాండ్‌లో 20 ఏళ్లలో ఏకంగా 750 చదరపు కిలోమీటర్ల మేర మంచు కరిగిపోయింది. అంటే, అక్కడ ఏడు శాతం మంచునీళ్లలా మారిపోయింది. ఆ దేశ భూభాగంలో 10 శాతానికిపైగా విస్తరించి ఉన్న హిమనీనదాలు 2019లో 10,400 చదరపు కిలోమీటర్లకు కుచించుకుపోయినట్టు ఐస్‌లాండ్ సైంటిఫిక్ జర్నల్ జోకుల్ అధ్యయనంలో తేలింది. మనదేశంలోని హిమాలయాల ఉత్తర వాలులో హిమనీనదాలలోనూ తగ్గుదల స్పష్టంగా కనిపిస్తుంది. 1980-2010 మధ్య చంద్ర-భాగా బేసిన్‌లో సంవత్సరానికి 0.1 శాతం మేర, పోయిక్ బేసిన్‌లో 1986-2001 మధ్య ఒక్క శాతం కంటే ఎక్కువ తగ్గినట్లు గుర్తించారు. కాగా లడఖ్‌లో మాత్రం తక్కువ స్థాయిలో ప్రభావం చూపుతున్నప్పటికీ, హిమనీనదాలు పెద్దవాటి కంటే వేగంగా తగ్గిపోతున్నాయి. 1973 నుంచి హిందూ కుష్ పర్వతాలలో భారీగా మార్పులు సంభవించినప్పటికీ వీటి పరిశీలనకు ఎటువంటి అధ్యయనాలూ జరగలేదు. ఖంబు ప్రాంతంలోని అధ్యయనాల ప్రకారం 1962-2005 మధ్య కాలంలో సంవత్సరానికి 0.12ం 0.05 శాతం, 1962-2011 మధ్యకాలంలో 0.27ం 0.06 శాతం మార్పులు నమోదయ్యాయి.

అయితే 1890 నుంచి ఇప్పటి వరకూ 2,200 చదరపు కిలోమీటర్ల మంచు కరిగిపోగా.. అందులో మూడో వంతు గడచిన 20 ఏళ్లలోనే కరిగిపోవడం గమనార్హం. ఇది ఆ దేశ హిమనీనదాల్లో 18 శాతం. ఈ 20 ఏళ్లలో కరిగిన మంచు ఐస్‌లాండ్‌లోని అతిపెద్ద మంచుకొండ అయిన హాఫ్జోకల్‌కు దాదాపు సమానమని అధ్యయనం తెలిపింది. ఇక, 2014లో ఒక్జోకల్‌ను గ్లేసియర్ (హిమనీ నదం) హోదా నుంచి పరిశోధకులు తప్పించారు. రెండేళ్ల క్రితం ఆ హిమనీనదం పూర్తిగా కరిగిపోయింది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 2.2 లక్షల హిమనీ నదాలుండగా.. అందులో చాలా వరకు వేగంగా కరిగిపోతున్నాయని ఇటీవల నాసా పరిశోధనల్లో వెల్లడయ్యింది. సముద్ర మట్టాల పెరుగుదలలో వీటి నీరు ఐదో వంతు (20%) అని ఈ ఏడాది ఏప్రిల్‌లో నేచర్ జర్నల్‌లో ప్రచురించిన ఫలితాల్లో పేర్కొన్నారు. 2000 నుంచి 2019 మధ్య ఏటా 26,700 కోట్ల టన్నుల మంచు కరిగినట్టు నాసా టెరా ఉపగ్రహ చిత్రాలు వెల్లడించాయి. 2000 నుంచి 2004 మధ్య ఏటా సగటున 22,700 కోట్ల టన్నుల మంచు కరిగితే.. అదే 2015 నుంచి 2019 మధ్య సగటు 29,800 కోట్లుగా తేలింది.

ఐస్‌లాండ్‌లో గ్లేసియర్స్‌కు ముప్పు పొంచి ఉందని, 2,200 నాటికి ఇవి పూర్తిగా కనుమరుగవుతాయని ఇటీవల నిపుణులు హెచ్చరించారు. '1890 నుంచి ఐస్‌లాండ్‌లో హిమానీనద-ప్రాంత వైవిధ్యాలు, వాతావరణంలోని వైవిధ్యాలకు స్పష్టమైన ప్రతి స్పందనను చూపుతాయి. దేశవ్యాప్తంగా హిమనీనదాలు కుదించుకుపోతున్నాయి. అయినప్పటికీ పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలు కొన్ని హిమనీనదాల ఉనికిని ప్రభావితం చేస్తాయి' అని అధ్యయనకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

అయితే ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటేన్ డెవలప్‌మెంట్ (ఐసిఐండి) ఆధ్వర్యంలో అంతకు మునుపు నిర్వహించిన ప్రాంతీయ అధ్యయనాలు అందుబాటులో లేకపోవడం వల్ల గతంలో నిర్వహించిన అనేక అధ్యయనాలను విశ్లేషించి ఓ అంచనాను రూపొందించింది. ఇప్పటివరకూ నమోదైన అంచనాలను అధ్యయనం చేసిన ఐసిఐఎండి భవిష్యత్తులో సంభవించే ప్రకృతి భయానక దృశ్యాన్ని గుర్తించింది. హిమనీ నదాల సంఖ్య పెరుగుదల ప్రధానంగా హిమనీనది విచ్ఛిన్నం కారణంగా పెద్ద నదులు చిన్న చిన్న నదులుగా విడిపోతున్నాయని గుర్తించారు. 1950 నుంచి హిమనీనదాల ప్రాంతంలో తగ్గుదల మాత్రమే గుర్తించారు. తూర్పు, మధ్య, పశ్చిమ హిమాలయాల్లో మంచుపర్వతాలు వేగంగా కుంచించుకుపోతున్నాయని అంచనా వేశారు. ఐసిఐఎంఓడి అంచనా ప్రకారం ప్రపంచంలో 1.5 డిగ్రీల సెల్సియస్, హెచ్‌కెహెచ్ ప్రాంతంలో మూడో వంతు హిమానీనదాలు 2100 నాటికి కనుమరుగవనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మూడింట రెండో వంతు కోల్పోయాము. 'ప్రపంచ సగటు కంటే పర్వతాలు వేగంగా వేడెక్కుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయగలిగినప్పటికీ, పర్వత ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెల్సియస్ కంటే పెరుగుదలను నమోదు చేసుకున్నాయి. పర్వత ఉష్ణోగ్రతలు 4-6 డి.సెకి పెరిగితే ఆహారం, పర్యావరణ వ్యవస్థల్లో మార్పులు, నీటి ప్రవాహాలు, విపత్తులు వంటి భయంకరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పదని డైరెక్టర్ జనరల్ డేవిడ్ జేమ్స్ మోల్డెన్ వివరించారు.

# మూవీ రివ్యూ






**టైటిల్ : అంటే..సుందరానికీ**
**నటీనటులు : నాని, నజ్రియా నజీమ్, నరేశ్ హర్షవర్ధన్, నదియా, రోహిణి తదితరులు**
**నిర్మాణ సంస్థ : మైత్రీ మూవీ మేకర్స్**
**నిర్మాతలు:నవీన్ యెర్నేని, రవిశంకర్ వై.**
**దర్శకత్వం : వివేక్ ఆత్రేయ**
**సంగీతం : వివేక్ సాగర్**
**సినిమాటోగ్రఫీ : నికేత్ బొమ్మి**

'శ్యామ్ సింగరాయ్'తో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కాడు నేచురల్ స్టార్ నాని. ఆ మూవీ ఇచ్చిన హిట్ కిక్‌తో వరుస సినిమాలు చేస్తున్నాడు. అయితే ఫలితాన్ని పట్టించుకోకుండా.. కొత్త జానర్స్‌ని ట్రై చేయడం నానికి అలవాటు. సినిమా సినిమాకి తన పాత్ర, కథలో వేరియేషన్ ఉండేలా చూసుకుంటాడు. వరసగా యాక్షన్ డ్రామా చిత్రాలు చేస్తూ వచ్చిన నాని.. ఈ సారి మాత్రం తనకు అచ్చొచ్చిన కామెడీ జానర్‌తో 'అంటే.. సుందరానికీ'అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ చిత్రంతో మలయాళ బ్యూటీ నజ్రియా నజీమ్ టాలీవుడ్‌కు పరిచయం అవుతుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు పాజిటివ్ రెస్పాన్స్ రావడం.. దానికి తోడు మూవీ ప్రమోషన్స్ కూడా గ్రాండ్‌గా చేయడంతో 'అంటే.. సుందరానికీ'పై హైప్ క్రియేట్ అయింది. భారీ అంచనాల మధ్య ఈ శుక్రవారం(జూన్ 10) విడుదలైన ఈ మూవీని ప్రేక్షకులు ఏ మేరకు ఆదరించారో రివ్యూలో చూద్దాం.

**కథేంటంటే**

సుందర్(నాని)..సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన యువకుడు. అతని తండ్రి(నరేశ్) కుటుంబ ఆచార వ్యవహారాలకు చాలా ప్రాధాన్యత ఇస్తుంటాడు. తన వంశంలో పుట్టిన ఏకైక కుమారుడు సుందర్‌ని కూడా తనలాగే పద్ధతిగా పెంచాలను కుంటాడు. సుందర్ చిన్న వయసులో చిరంజీవి సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించే అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారిపోతుంది. దీంతో కొడుకు జాతకంలో ఏదో దోషం ఉందని జ్యోతిష్యుడు జోగారావు(శ్రీకాంత్ అయ్యంగార్) ని సంప్రదిస్తుంది అతని ఫ్యామిలీ.



అప్పటి నుంచి సుందర్ జీవితమే మారిపోతుంది. డబ్బు కోసం జోగారావు ఈ దోషం, ఆ దోషం అంటూ సుందర్‌తో రకరకాల హోమాలు చేయిస్తాడు. దీంతో సుందర్‌కి విసుగెత్తి ఇంట్లో అబద్ధాలు చెప్పడం ప్రారంభిస్తాడు. మరోవైపు క్రిస్టియన్ ఫ్యామిలీకి చెందిన యువతి లీలా థామస్(నజ్రియా నజీమ్) ఫ్యామిలీ కూడా మతంపై మమకారం ఎక్కువ. ఆమె తండ్రి(అలగం పెరుమాల్) హిందువులు పెట్టిన ప్రసాదం కూడా స్వీకరించడు. అలాంటి ఫ్యామిలీకి చెందిన సుందర్, లీలాలు..ప్రేమలో పడతారు. ఇరు కుటుంబాలను ఒప్పించడానికి రకరకాల అబద్ధాలు ఆడతారు. ఆ అబద్ధాలు వీరి జీవితంలో ఎలాంటి అల్లకల్లోలానికి దారి తీశాయి? సుందర్, లీలాలు చెప్పిన అబద్ధాలు ఏంటి? ఇతర మతస్థులతో స్నేహం అంటేనే మండిపడే సుందర్, లీలాల కుటుంబ సభ్యులు వీరికి పెళ్లికి ఎలా ఒప్పుకున్నారు? అనేది తెలియాలంటే థియేటర్స్‌లో 'అంటే సుందరానికీ'సినిమా చూడాల్సిందే.

**లా ఉందంటే..** : వేరు వేరు మతాలకు చెందిన అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకోవడం.. వారి పెళ్లికి పెద్దలు నిరాకరించడం.. పేరెంట్స్‌ని ఎదురించి, అష్టకష్టాలు పడి వారు పెళ్లి చేసుకోవడం..ఈ కాన్సెప్ట్‌తో గతంలో చాలా సినిమాలే వచ్చాయి.'అంటే సుందరానికీ' కథ కూడా ఇంచుమించు ఇలానే ఉంటుంది..అయితే పాత కథకు కొత్త ట్రీట్‌మెంట్ ఇచ్చి, కాస్త కామెడీగా చిత్రాన్ని మలిచాడు దర్శకుడు వివేక్ ఆత్రేయ. పద్ధతులు ఆచారాల ముసుగులో లోపలి మనిషిని చంపుకోవద్దు. మతం కంటే మానవత్వం గొప్పదనే విషయాన్ని అంతర్లీనంగా చెబుతూ ఓ అందమైన లవ్‌స్టోరీని చూపించాలనుకున్నాడు. అయితే ఈ విషయంలో దర్శకుడు కాస్త విఫలం అయ్యాడు. ?ఎలాంటి అశ్లీలతకు తావివ్వకుండా..కంప్లీట్ క్లీన్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కించినా.. కథనం మాత్రం సాదాసీదాగా సాగుతుంది. ఫస్టాఫ్‌లో బ్రాహ్మణ కుర్రాడు సుందర్ బాల్యంలో వచ్చే ఒకటి రెండు సన్నివేశాలు తప్పా మిగతావేవి అంతగా ఫన్‌ని క్రియేట్ చేయలేదు. హీరోయిన్‌ని పరిచయం చేయడానికి చాలా సమయం తీసుకున్నాడు దర్శకుడు. దీనికి తోడు హీరో కంటే ముందే ఆమెకు మరో లవ్ స్టోరిని యాడ్ చేసి ఫస్టాఫ్ అంతా సాగదీశాడనిపిస్తుంది. ఇక సెకండాఫ్‌లో అసలు కథ మొదలవుతుంది. సుందర్, లీలా ఇద్దరు అమెరికాకు వెళ్లడం.. పెళ్లి కోసం అబద్ధం చెప్పి ఇండియాకు రావడంతో అసలు స్టోరీ ముందుకు సాగుతుంది. వీరిద్దరు చెప్పిన అబద్ధాలే నిజంగా జరగడంతో అసలేం జరిగిందనే ఉత్కంఠ మొదలవుతుంది. ఆ నేపథ్యంలో వచ్చిన కామెడీ సీన్స్ కూడా బాగున్నాయి. క్లైమాక్స్‌లో 'ప్రెగ్నెన్సీ అనేది చాయిస్ మాత్రమే కానీ. ఆప్షన్ కాదు' అని హీరో చెప్పే డైలాగ్ హృదయాలను హత్తుకుంటుంది. దాదాపు మూడు గంటల నిడివి ఉండడం సినిమాకు మైనస్. మొత్తంగా అబద్ధాలతో కాసేపు నవ్వించి.. చివర్లో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకులను థియేటర్స్ నుంచి బయటకు పంపాడు దర్శకుడు.

**ఎవరెలా చేశారంటే..** : యాక్షన్ అయినా.. కామెడీ అయినా తనదైన నటనతో మెప్పిస్తాడు నాని. పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తాడు. ఈ చిత్రంలో కూడా అంతే.. సుందర్ ప్రసాద్ పాత్రలో ఒదిగిపోయాడు. తనదైన కామెడీతో నవ్వించాడు. లీలా థామస్‌గా నజ్రియా ఆకట్టుకుంది. తెలుగులో ఇది ఆమెకు తొలి సినిమా అయినా.. చాలా బాగా నటించింది. పైగా తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకోవడం విశేషం. సుందర్ తండ్రిగా నరేశ్ మరోసారి తన అనుభవాన్ని తెరపై చూపించాడు.

ఇక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మహిళగా, భర్త మాటకు ఎదురు చెప్పలేని భార్యగా రోహిణి తనదైన నటనతో ఆకట్టుకుంది. హీరోయిన్ తల్లిగా నదియ, తండ్రిగా అలగం పెరుమాల్ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఇక ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కూడా ఉంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ ఎందుకు దాచిపెట్టిందో తెలియదు కానీ.. ఆమె పాత్ర మాత్రం అందరిని ఆకట్టుకుంది. సుందర్ సహో ద్యోగి సౌమ్య పాత్రలో అనుపమ మెరిసింది. ఇక సుందర్ బాస్‌గా హర్షవర్ధన్ తనదైన కామెడీతో నవ్వించాడు. మిగిలిన నటీ నటులు తమ పాత్రల పరిధిమేర నటించారు.ఇక సాంకేతిక విష యాని కొస్తే.. వివేక్ సాగర్ సంగీ తం పర్వాలేదు. పాటలు అంతం మాత్రమే అయినా.. నేపథ్య సంగీతం మాత్రం కొత్తగా ఉంది. నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. ఎడిటర్ రవితేజ గిరిజాల తన కత్తెరకు ఇంకాస్త పనిచెప్పాల్సింది.ముఖ్యంగా ఫస్టాఫ్‌లో కొన్ని సీన్స్‌ని మరింత క్రిస్పీగా కట్ చేయాల్సింది. మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ రిచ్‌గా ఉన్నాయి.



# మూడు నెలల్లో మూడు ప్రాజెక్టులు పూర్తి

## నిర్మాతలను హడలెత్తిస్తున్న పవన్ కొత్త నిర్ణయం



2024 ఎన్నికలే లక్ష్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒక పొలిటికల్ టూర్ ను ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. దీంతో జనసేన పార్టీ పునాదులను బలోపేతం చేసి, జనసైనికుల లో కొత్త ఉత్సాహం నింపాలని పవన్ కోరిక. ఇందుకోసం పవన్ వచ్చే అక్టోబర్ నుండి పొలిటికల్ టూర్ ను స్టార్ట్ చేయబోతున్నారని వినికిడి. ఈ వార్తపై ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం లేదు ...కానీ ఒకవేళ ఈ వార్తే నిజమైతే , ఆయన చేస్తున్న సినిమాల పరిస్థితేమిటని? అందరూ ఆలోచిస్తున్నారు. పవన్ కోరికలో న్యాయముంది...కానీ ఈ కొరికే పవన్ తో సినిమాలకు కమిటైన నిర్మాతల గుండెల్లో గుబులు రేపుతోంది.

ఆయన పూర్తి చేయవలసిన సినిమాలు మూడు ఉన్నాయి. క్రిష్ డైరెక్షన్లో ఆల్రెడీ సెట్స్ పై ఉన్న హరిహరవీరమల్లు, సెట్స్ పైకి వెళ్లాల్సిన భవదీయుడు భగత్ సింగ్, ప్రచారం లో ఉన్న వినోదయ సిత్తం సినిమాలను పవన్ కేవలం మూడు నెలల్లోనే పూర్తి చెయ్యాల్సిన పరిస్థితి. కానీ ఈ సినిమాలకు ఆయా నిర్మాతలు ముందుగానే షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు, రిలీజ్ డేట్..అని ఒక షెడ్యూల్ ను తయారుచేసుకుని ఉంటారు కదా. తాజాగా పవన్ తీసుకున్న నిర్ణయంతో కేవలం మూడు నెలల్లో మూడు సినిమాలను పూర్తి చేసేందుకు నిర్మాతలు ఆర్థికంగా, మానసికంగా చాలా ఒత్తిడికి గురవుతారు. పవన్ తీసుకున్న నిర్ణయం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న నిర్మాతలు ఆయనతో ఈ విషయాన్నీ చెప్పి ఆయన మనసు మార్చాలని చూస్తున్నారట. బహుశా, ఈ విషయంలో పవన్ ఎవరి మాట వినకపోవచ్చు.

# రీఎంట్రీకి సిద్ధమవుతున్న కాజల్ అగర్వాల్



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఇటీవలె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. తనయుడికి నీల్ కిచ్లూ అని ఇప్పటికే పేరు కూడా పెట్టేసింది. ఇక చిన్నారి రాకతో కాజల్ కుటుంబం సంతోషంలో మునిగితేలుతోంది. ఈ క్రమంలో కాజల్ సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఆమె తిరిగి సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని వినికిడి.

కాగా ప్రెగ్నెన్సీ సమయంలో 'ఆచార్య' మూవీతో పాటు అప్పటికే సైన్ చేసిన పలు ప్రాజెక్ట్స్ నుంచి కూడా ఆమె తప్పుకుంది. దీంతో కాజల్ పూర్తి కుటుంబంతో దృష్టి పెట్టాలనుకుంటోందని, అందుకే సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకుందంటూ ఒక్కసారిగా వార్తలు గుప్పుమన్నాయి. వీటిపై కాజల్ కూడా స్పందించకపోవడంతో అంతా నిజమే అనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తిరిగి సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రెగ్నెన్సీ సమయంలో బొద్దుగా తయారైన కాజల్ బిడ్డ పుట్టిన అనంతరం నాజుగ్గా తయారవుతోంది

కొడుకు నీల్ కిచ్లు పుట్టిన అనంతరం ఆమె తరచూ తన ఫొటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఇందులో కాజల్ రోజురోజుకు కాస్తా నాజుగ్గా, గ్లామరస్‌గా కనిస్తోంది. సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చేందుకే తను శరీరాకృతిపై ఫోకస్ పెడుతుందని, వీలైనంత త్వరగా బరువు తగ్గి సినిమాలు చేయాలని భావిస్తోందని సన్నిహితుల నుంచి సమాచారం. అంతేకాదు ఇప్పటికే కాజల్ మేనేజర్, ఏజెంట్స్ ఆమె రీఎంట్రీకి తగిన కథ కోసం చూస్తున్నారట. మరి ఆమె మళ్లీ సినిమాల్లోకి వచ్చి అభిమానులను ఎంతమేర అలరిస్తుందో వేచి చూడాలి.

# జస్టిన్ బీబర్‌కు అరుదైన వ్యాధి



ప్రముఖ కెనడా పాప్ సింగర్, గ్రామీ అవార్డు గ్రహీత జస్టిన్ బీబర్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడట. ఈ విషయాన్ని ఆయనే సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తనకు రామ్‌సే హంట్ సింగ్రోమ్ అనే వ్యాధికి గురయ్యానని, దీంతో ముఖం లోని నరాలపై ప్రభావితం చూపుతోందని ఇన్‌స్టాగ్రామ్‌లో తన అభిమాను లకు శుక్రవారం తెలిపారు. తన ముఖం కుడి భాగాన పక్షవాతానికి గురౌతున్నట్లు అనిపిస్తుందని అన్నారు. ఇటు వైపు సరిగా కదిలించలేకపోతున్నట్లు వీడియోలో పేర్కొన్నారు. కన్ను, ముక్కు వంటి అవయవాలు కదల్చలేకపోతున్నానని తెలిపారు.

# కొత్త జంట నయనతార-విఘ్నేశ్‌లపై టీటీడీ కేసు?



తిరుపతి : పెళ్లితో దాంపత్య జీవితంలో అడుగుపెట్టిన కొన్ని గంటల్లోనే నటి నయనతార, దర్శకుడు విఘ్నేశ్‌లు వివాదంలో చిక్కుకున్నారు. గురువారం ఉదయం చెన్నై సమీపంలోని మహాబలిపురం వడనెమ్మేలిలోని షెరటాన్ గ్రాండ్ హొటల్‌లో నయనతార, విఘ్నేశ్‌ల వివాహం జరిగింది. అనంతరం కొత్త జంట వెంకటేశ్వరుడి ఆశీర్వాదం కోసం తిరుమలకు వెళ్లారు. దర్శనానంతరం నయన-విఘ్నేశ్ దంపతుల ఫొటో షూట్ జరిగింది. అయితే నూతన దంపతులు తిరుమల మాడ విధుల్లోకి చెప్పులు ధరించి వచ్చారు. తిరుమల పరిసరాలను టిటిడి, భక్తులు పవిత్రంగా భావిస్తారు. అలాంటి పవిత్ర స్థలంలోకి నయనతార, విఘ్నేశ్‌లు చెప్పులు ధరించి వెళ్లడంపై భక్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీన్ని భద్రతా వైఫల్యంగా పరిగణించిన టిటిడి నయనతార, విగేశ్ జంటపై, అలాగే ఫొటో షూట్ చేసిన వారిపై కేసు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొంది.

# నాపై ఈ అపనిందలు సబబేనా..

## ఎన్‌సిబి అధికారులను ప్రశ్నించిన ఆర్యన్ ఖాన్



ముంబయి : ఎటువంటి డ్రగ్స్ కార్యకలాపాలకు పాల్పడకపోయినా, తనపై అంతర్జాతీయ మాదక ద్రవ్యాల సరఫరాదారుడిగా ముద్ర వేయడం సరైనదా అంటూ బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్‌ఖాన్ నార్కోటిక్స్ బ్యూరో అధికారులను ప్రశ్నించారు. గత ఏడాది అక్టోబర్‌లో ముంబయి తీరంలో క్రూజ్ నౌకలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్‌సిబి అధి,కారులు.. దీనికి ఆర్యన్ ఖాన్‌కు సంబంధముం దంటూ ఆయన్ను అరెస్టు చేశారు. అనేక వారాలు జైలులో ఉంచారు. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ సమయంలో ఆర్యన్ అక్రమ డ్రగ్స్ కలిగి ఉండటం నుండి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాతో సంబంధాలు న్నాయన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. కానీ గత నెలలో తగిన సాక్షాలు లేవని పేర్కొంటూ ఎన్‌సిబి క్లీన్‌చిట్ ఇచ్చింది. అయితే ఇన్ని రోజులు ఆర్యన్, షారూఖ్ ఎదుర్కొన్న అవమానాలపై ఎంతో ఆవేదన వ్యక్తం చేశారని సీనియర్ ఎన్‌సిబి అధికారి ఒకరు తెలిపారు.ఈ కేసు విచారించేందుకు ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు బృందానికి నేతృత్వం వహించిన ఎన్‌సిబి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంజరు సింగ్.. ఆర్యన్‌తో ఇటీవల జరిగిన సంభాషణను గుర్తు చేసుకున్నారు. ఈ కేసులో తనను పట్టుకున్నప్పుడు అంతర్జాతీయ డ్రగ్స్ సరఫరాదారుడిగా తనపై ముద్రవేశారని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు ఆర్థిక సాయం చేస్తున్నానని తనపై అపనిందలు వేశారని, మరి ఇప్పుడు ఈ ఆరోపణలు అసంబంద్ధమైనవి కావా, తన ప్రతిష్టను నాశనం చేశారంటూ, అన్ని వారాలు తాను జైలులో ఉండాల్సిన వ్యక్తినా అంటూ తన ముందు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

తమను సమాజం నాశనం చేసే నేరస్తులు, రాక్షసులుగా చిత్రించారని షారూఖ్ అన్నట్లు తెలిపారు. ఈ కేసులో కుమారుడికి క్లీన్‌చిట్ రావడంతో షారూఖ్ సినిమాలపై ఫోకస్ పెంచారు. పఠాన్, జవాన్, డుంకీ వంటి చిత్రాలు త్వరలో రాబోతున్నట్లు ప్రకటించారు.

# బన్నీ శపథం నిజమైన వేళ.. ఇంతకీ ఆయన ఏం శపథం చేశారు?



"'పుష్ప' సినిమా విడుదలైన తర్వాత.. ప్రతి దర్శకుడు సుకుమార్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తారు. ఆయన వద్ద నుంచి సినిమాని తెరకెక్కించడంలో కొత్త టెక్నిక్స్ నేర్చుకుంటారు. అలా కనుక జరగకపోతే.. మైత్రి ఆఫీస్‌లో చొక్కా విప్పి తిరుగుతా".. 'పుష్ప' విడుదల ముందు రోజు జరిగిన ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్ చెప్పిన మాటలు ఇవి. ఇప్పుడిదే మాటలను సినీ ప్రియులు గుర్తు చేసుకుంటున్నారు. బన్నీ చెప్పింది నిజమే అంటున్నారు. ఇంతకీ అసలేమైందంటే..

క్రిస్మస్ కానుకగా గతేడాది డిసెంబర్‌లో 'పుష్ప' విడుదలైన నాటి నుంచి భారతదేశ చిత్ర పరిశ్రమ లోని చాలామంది ఈ చిత్రబృందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.బన్నీ, సుకుమార్‌ని పొగడ్తలతో ముచ్చెత్త కుండా ఉండలేకపోతున్నారు. ఈక్రమంలోనే తాజాగా బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, 'మున్నాబాయ్ ఎంబీబీఎస్', 'త్రీ ఇడియట్స్', 'పీకే', 'సంజు' వంటి చిత్రాలు తెరకెక్కించిన రాజ్‌కుమార్ హిరాణీ.. సుకుమార్ వర్క్‌ని ప్రశంసించారు. సుకుమార్ నంబర్ తెలుసుకుని ప్రత్యేకంగా మెస్సేజ్ పంపించారు. "గుడ్ మార్నింగ్ సుకుమార్ జీ.. నేను రాజు హిరాణీ. 'పుష్ప' సినిమా చూసిన నాటి నుంచి మీకు మెస్సేజ్ చేయాలనుకుంటున్నా. కాకపోతే మీ నంబర్ నా వద్ద లేదు. నిన్ననే నేను మహవీర్ జైన్‌ని కలిశా. ఆసమయంలో మేమిద్దరం మీ గురించే మాట్లాడుకున్నాం. అలా, నాకు మీ నంబర్ దొరికింది. 'పుష్ప'ని మీరు ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు.

మీ సినిమా గురించి నేను ఎంతోమందితో చెప్పాను. నేను చెప్పే విధానం చూసి నాకేదో అయ్యిందన్నట్లు వాళ్లు ఆశ్చర్యపోయారు. కథ.. ఒక సీన్‌ని మించి మరొక సీన్‌ని మీరు తెరకెక్కించిన విధానం అదిరింది. బన్నీ నటన, సాంగ్స్, బ్యాగ్రౌండ్ మ్యూజిక్ బాగున్నాయి. గ్రేట్ ఎంటర్‌టైనర్. ఎంజాయ్ చేశా.

మీరు ఇలాగే అత్యద్భుతమైన చిత్రాలు తెరకెక్కించాలి. మిమ్మల్ని ఒక్కసారి కలవాలనుకుంటున్నా. ఎప్పుడైనా మీరు ముంబయికి వస్తే తప్పకుండా నాకు ఒక్కసారి ఫోన్ చేయండి" అని హిరాణీ మెస్సేజ్ చేశారు. హిరాణీ మెస్సేజ్‌పై స్పందించిన సుక్కు.. "మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌గా చెప్పుకునే మీ నుంచి సందేశం రావడం నాకెంతో ఆనందంగా ఉంది. మీరు పంపించిన మెస్సేజ్‌ని నా స్నేహితులందరికీ ఫార్వర్డ్ చేయడం వల్ల మీకు రిప్లై ఆలస్యంగా ఇస్తున్నాను. ఫిల్మ్ మేకింగ్, కథ రాయడంలో మీరు నాకెంతో స్ఫూర్తి" అని రిప్లై ఇచ్చారు. ప్రస్తుతం ఈ మెస్సేజ్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అది చూసిన నెటిజన్లు ఆరోజు బన్నీ చేసిన శపథాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

### జూన్ 18 నుంచి జూలై 9 దాకా అమెరికాలో

# పెద్ద ఎత్తున శ్రీనివాస కళ్యాణాలు

## - భక్తులు ఉచితంగా కల్యాణంలో పాల్గొనవచ్చు

## - టీటీడీ చైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి



తిరుమల (విజయభాను న్యూస్) : అమెరికా దేశంలో స్థిరపడిన భారతీయులు, తెలుగువారి కోసం జూన్ 18 నుంచి జూలై 9వ తేదీ వరకు ఎనిమిది నగరాల్లో శ్రీనివాస కల్యాణాలు నిర్వహించనున్నామని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి వెల్లడించారు. తిరుమలలో శనివారం ఆయన ఈవో ధర్మారెడ్డి తో కలసి మీడియాతో మాట్లాడారు. గత రెండున్నరేళ్లుగా కరోనా వల్ల ఇతర దేశాల నుంచి భక్తులు తిరుమల శ్రీవారి దర్శనానికి రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశం మేరకు అమెరికాలోని భక్తుల కోసం టీటీడీ శ్రీవారి కల్యాణాలు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రవాసభారతీయుల అసోసియేషన్ సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించబోతున్నామన్నారు. జూన్ 18న శాన్ ఫ్రాన్సిస్కో, 19న సియాటెల్, 25న డల్లాస్, 26న సెయింట్ లూయిస్, 30న చికాగో నగరాల్లో స్వామివారి కల్యాణాలు నిర్వహిస్తామని ఛైర్మన్ చెప్పారు. అలాగే జూలై 2న న్యూ ఆర్లిన్, 3న వాషింగ్టన్ డిసి, 9వ తేదీ అట్లాంటా నగరాల్లో శ్రీవారి కళ్యాణాలు జరుగుతాయన్నారు. ఇతర దేశాల నుంచి కూడా తమ ప్రాంతాల్లో శ్రీవారి కళ్యాణాలు నిర్వహించాలని విజ్ఞప్తులు వచ్చాయని వాటిని కూడా పరిశీలిస్తామని సుబ్బారెడ్డి తెలిపారు. ప్రపంచం వ్యాప్తంగా సనాతన హిందూ ధర్మ ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమం లో ఈఓ ధర్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



# అంకితభావంతోనే వైద్య వృత్తిలో రాణింపు

## గీతం వైద్యవిద్యార్థుల "వైట్‌కోట్" ధారణలో ఎమ్.శ్రీభరత్



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : వైద్య వృత్తిలో రాణించాలంటే అంకితభావంతో పాటు ఎన్నో అగ్నిపరీక్షలకు తట్టుకుని నిలవాలని స్వీయ ప్రతిభను పెంచుకోవాలని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు అను బంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాలలో మెడికల్ యుజి మరియు పిజి విద్యార్థులకు నిర్వహించిన "వైట్‌కోట్ ధారణ" కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. వైద్య విద్యలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి అత్యాధునిక ఆస్పత్రితో పాటు 250 మందికి పైగా బోధనా సిబ్బందితో అంతర్జాతీయ ప్రమాణాలతో గీతం వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం అర్థం చేసుకుని ఎదగాలన్నారు. మెడికల్ పి.జి విద్యార్థులు గీతం ఆస్పత్రి ద్వారా ప్రజలు మెచ్చే విధంగా పైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు. జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఆస్పత్రిలో స్వస్థత కోసం చేరే ప్రతి రోగిని ఓపికతో సమగ్రంగా పరిశీలించి చికిత్స అందించాలన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకరం వారియర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఇంజనీరింగ్ సహ వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులతో మమేకం కావాలన్నారు.

ఇంజనీరింగ్, ఫార్మశీ, సైన్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు అభ్యసించే వారితో వైద్య విద్యార్థులు ఆలోచ నలు పంచుకోవడం కొత్త ఆవిష్కరణలకు దారితీస్తుం దన్నారు.

జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ మాట్లాడుతూ దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన వారు ప్రస్తుత విద్యాసంవత్సరంలో గీతం వైద్య కళాశాలో ప్రవేశం పొందారని తెలిపారు. వైద్య విద్యార్థులకు నిరంతరం సహకరించడానికి అధ్యాపకులు అందుబాటులో ఉంటారని వారి ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు నన్నారు. జిమ్‌సర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.జి.రామాంజనేయులు ఆస్పత్రిలో సధుపాయాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా ప్రవేశం పొందిన వైద్య విద్యార్థులకు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెల్లకోటును అందజేశారు. అనంతరం విద్యార్థులు వైద్య వృత్తి పట్ల నిబద్ధతతో, విలువలతో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పలువురు అధ్యాకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యార్థులను ఫ్రెషర్స్‌డే సాంస్కృతిక కార్యక్రమా లకు ఆహ్వానం పలికారు.

# విద్యాదానం తోనే దేశ ప్రగతి

- రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్
- బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విద్యార్థులకు ఎన్నో సహాయ సహకారాలు
- రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్



విశాఖ దక్షిణం (విజయభాను న్యూస్) : అన్ని దానాల్లో కన్నా విద్యాదానం మిన్న, విద్యతోనే దేశ ప్రగతి అని రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ,విశాఖ జిల్లా బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం విశాఖ సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో దాదాపు ఆరువందలమంది విద్యార్థినీ,విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై పుస్తకాలు అందచేశారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పుస్తక సాయం వల్ల చదువుకు ఊతమిచ్చినట్లు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తూ అనేక పథకాలు ప్రవేశపెట్టారని అర్హులందరూ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు.బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విద్యార్థినీ,విద్యార్థులకు అనేక పథకాలద్వారా సహాయ మందిస్తు న్నామని సుధాకర్ తెలిపారు. విద్యతో సమాజం అభివృద్ధి చెందుతుందని, విద్యార్థినీ, విద్యా ర్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా నిర్వాహ కులు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య , విశాఖ జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సభ్యులను సుధాకర్ అభినందిం చారు. ఒకటవ తరగతినుంచి పదవ తరగతి వరకు చదువుతున్న దాదాపు ఆరువందలమంది విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య జ్వాలాపురం శ్రీకాంత్, రాచకొండ దశరథ,నండూరి సుబ్రహ్మణ్యం,కందాళ కామేష్,కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.



# పొగాకు ఉత్పత్తుల్ని వాడొద్దంటూ ప్రజల్లో అవగాహన

- మారుమూల ప్రాంతాలకు సైతం క్యాన్సర్ చికిత్సను అందుబాటులో కి తేవాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం
- పొగాకు ఉత్పత్తులు వాడొద్దు-క్యాన్సర్ బారిన పడొద్దు
- వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : క్యాన్సర్ కు దారితీసే పొగాకు ఉత్పత్తుల్ని వాడొద్దంటూ ప్రజల్లో అవగాహన తీసుకొస్తున్నామన్నారు. హెూమీబాబా క్యాన్సర్ పరిశోధనా కేంద్రం, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహించిన వాక్ థాన్ లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక సహకారం కోసం హెూమీబాబా క్యాన్సర్ పరిశోధనా సంస్థ తో ఎంవోయూ చేస్తున్నామని తెలిపారు. నాలుగైదేళ్లలో ఏపీలో క్యాన్సర్ చికిత్స కు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. ఏపీలో కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ కేర్ ను అందుబాటులో కి తేవాలన్నదే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ధ్యేయం అన్నారు. కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ కేర్ లో ప్రివెన్షన్ , డయగ్నోసిస్ , ట్రీట్మెంట్, ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏడాదీ 70 వేల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, దాదాపు 35 వేల మంది వరకూ చనిపోతున్నారు. 25శాతం మంది పొగాకు ఉత్పత్తుల్ని వాడడం వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారని అన్నారు.

క్యాన్సర్ చికిత్స కు ఆరోగ్య శ్రీ కింద దాదాపు 400 కోట్లు ఖర్చు చేస్తున్నామని, క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్నామన్నారు.

పొగాకు ఉత్పత్తులు వాడొద్దు-క్యాన్సర్ బారిన పడొద్దు జీవన శైలి లో మార్పులు తీసుకురావడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా బయటపడొచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలోజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ లక్ష్మి, హెూమీ బాబా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డాక్టర్లు, మెడికల్, మున్సిపల్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com